

ప్రజలే ప్రభువులు

# జనబలం

జనవరి 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-





## భారత రిపబ్లిక్ @ 75
## కొత్త రాజ్యాంగం అవసరమా?



## యువభారత్ సాధికారత



## విద్యపై ట్యాక్స్ పేయర్లు ప్రశ్నించాలి

## ఏపీ, తెలంగాణల్లో గ్రామ న్యాయాలయాలు ఎక్కడ?

# నిశ్శబ్ద ఆర్థిక సంస్కర్తకు ఘన నివాళి




డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక దిగ్గజాన్ని కోల్పోయింది. ఆయన సామాన్య కుటుంబంలో పుట్టారు. విద్య, ఉపకార వేతనం, కష్టించేతత్వం, సహనశీలతతో ఉన్నత స్థాయికి ఎదిగారు. అత్యుత్తమ ప్రతిభాపాటవాలు ఉన్నవారికి ఆధునిక భారతదేశం అందించే అవకాశాలకు డాక్టర్ సింగ్ ఒక నిదర్శనం. సంక్షోభ సమయంలో మన ఆర్థిక వ్యవస్థకు ఆయన సేవలు , ఆర్థిక స్వేచ్ఛ, పోటీ, ఎంపిక అవకాశాల పట్ల చెదరని అంకిత భావం, లైసెన్స్ -పర్మిట్ -కోటా రాజ్యాన్ని కూల్చడానికి ఆయన అలుపెరుగని కృషి జాతి స్మృతి పదంలో నిరంతరం నిలిచి ఉంటాయి. ఎంతో ఉదాత్తత, నిజాయితీ, హుందాతనం, విశ్వసనీయత, వినమ్రత, నిరాడంబరత కలబోసుకున్న మనిషి. క్లిష్ట సమయంలో ప్రధానమంత్రిగా భారతదేశ ఐక్యత, ప్రగతి పట్ల ఆయన అచంచల నిబద్ధత కనబరిచారు. చాలా తక్కువ మాట్లాడేవారు. కానీ ఆ మాటలు ఎంతో శాంతంగా, హేతుబద్ధంగా, తర్కబద్ధంగా ఉండేవి. డాక్టర్ సింగ్, మిమ్మల్ని కోల్పోతున్నాం. మీరు లేని లోటు పూడ్చలేనిది.

ఓం శాంతి

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా
వ్యవస్థాపకులు





# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

జనవరి
2025

సంపుటి 26 సంచిక 01


**జనబలం చందా రుసుము వివరాలు**

| | |
|---|---|
| సంవత్సర చందా | : రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





06 భారత రిపబ్లిక్ @75... కొత్త రాజ్యాంగం అవసరమా?

13 తెరవెనుక నిపుణుడు

15 రాజ్యాంగంపై చర్చ..రాజకీయ రచ్చ

19 యువభారత్..సాధికారిత

31 ఏపీ అభివృద్ధికి రోడ్ మ్యాప్



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక,
హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# పౌరసమాజ చైతన్యమే రాజ్యాంగానికి రక్ష!

భారత రాజ్యాంగం వయసు డెబ్బై అయిదేళ్లు. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొంది, 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. ఏ దేశ చరిత్రలోనైనా డెబ్బై అయిదేళ్లు అంటే పెద్దగా లెక్కించదగిన కాలం కాదు. చరిత్ర శతాబ్దాల మీద, దశాబ్దాల మీద లెక్కించబడుతుంది. కాలగమనంలో ఒకటి అటైనా, ఇటైనా చరిత్రకు లెక్కలేదు. దాని దారిన అది నడుస్తూనే ఉంటుందని చరిత్రకారులు అంటారు! కానీ ఒక మనిషి జీవిత కాలంతో పోల్చి చూసినప్పుడు 75 ఏళ్లు ఒక గణనీయమైన కాలమే అని చెప్పాలి.

అందుకే రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాజ్యాంగ రచనా చరిత్రను మరోసారి గుర్తు చేసుకుంటున్నాం! భారత ప్రభుత్వం కూడా విద్యార్థులను, యువతను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు చేపట్టింది. రాజ్యాంగ ప్రవేశికను చదువుతూ వీడియోను పెడితే ఒక ప్రశంసా పత్రాన్ని ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది.

ఈ సందర్భంలో రాజ్యాంగ రచన జరిగిన నేపథ్యాన్ని, రచనా క్రమాన్ని, రాజ్యాంగ ఆదర్శాలను, రాజ్యాంగం ముందున్న సవాళ్ళను, వాటిని అధిగమించడానికి అనుసరించాల్సిన ఆచరణాత్మక విధానాలను మన సమాజం మరో సారి చర్చిస్తున్నది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశపు ఆధునిక రాజకీయ పటాన్ని ఏర్పరచి, ఒక ఆధునిక, నాగరిక, ప్రజాస్వామ్య సమాజ నిర్మాణానికి భారతీయులు సంకల్పించుకున్నారు. అందుకోసం ఎన్నికల ద్వారా భారత రాజ్యాంగ రచనా సభను ఏర్పాటు చేసుకున్నారు. దేశ విభజనకు ముందు రాజ్యాంగ రచనా సభకు ఎన్నికలు జరిగాయి. విభజన అనంతరం కొందరు సభ్యులు పొరుగు దేశపు రాజ్యాంగ రచనా సభకు వెళ్లిపోయారు.

దాంతో రాజ్యాంగ రచనా సభలో 1947 డిసెంబర్ నాటికి భారతదేశపు 12 ప్రావిన్సుల నుండి 299 మంది సభ్యులు ఉండగా, 29 స్వదేశీ సంస్థానాల నుండి 70 మంది ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. 1946 డిసెంబర్ 9న సభ తొలి సమావేశం సచ్చిదానంద సిన్హా అధ్యక్షతన జరిగింది. డిసెంబర్ 11 న డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్‌ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

రెండు సంవత్సరాల పదకొండు నెలల పదిహేడు రోజులపాటు రాజ్యాంగ రచనా సభ పనిచేసింది. మొత్తం పదకొండు సార్లు సభ సమావేశం అయ్యింది. 1947 ఆగస్టు 29 న డ్రాఫ్టింగ్ కమిటీ ఏర్పాటు అయ్యింది. రాజ్యాంగ రచనా సభకు సలహాదారుగా నియమితులైన డాక్టర్ బెనెగల్ నరసింగరావు భారత రాజ్యాంగ తొలి ముసాయిదాను రచించారు.

బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంలో సివిల్ సర్వెంట్‌గా కలకత్తా ప్రెసిడెన్సి చీఫ్ సెక్రటరీగా, జమ్మూ కాశ్మీరు మహారాజు వద్ద ప్రధానమంత్రిగా, 1935 ఇండియా చట్టం రచనలో కీలక భూమిక పోషించిన డాక్టర్ బి.ఎన్.రావ్ 243 ఆర్టికల్లు, 13 షెడ్యూళ్లతో రాజ్యాంగ తొలి ముసాయిదాను రచించారు. దానినే రాజ్యాంగ రచనా కమిటీ సభ్యులకు అందచేసారు. ఆ ముసాయిదాను ఆధారంగా చేసుకుని 315 ఆర్టికల్లు, 13షెడ్యూళ్లతో రెండో ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీ రూపొందించింది.

దానిపైనే రాజ్యాంగ రచనా సభ సుదీర్ఘంగా చర్చించింది. సభ్యులు 7635 సవరణలను ప్రతిపాదించగా 2473 సవరణలను సభ ఆమోదించింది. రాజ్యాంగ ముసాయిదా పూర్తయిన సందర్భంగా 1949 నవంబర్ 25 వ తేదీన డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ హెూదాలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ రచనా నేపథ్యాన్ని, దాని ఆదర్శాలను, ఎదురయ్యే సవాళ్ళను ప్రస్తావిస్తూ చేసిన అత్యద్భుత ప్రసంగం ఇప్పటికీ ప్రాసంగికతను కలిగి ఉంది.

డాక్టర్ అంబేద్కర్ చేసిన ఆ ప్రసంగాన్ని నేటి తరం లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. అసాధ్యమైన అద్భుతాలకు, ఆచరణ సాధ్యమైన మంచికి మధ్య సమతుల్యత కోసం జాతీయోద్యమ నాయకత్వం కలిసికట్టుగా చేసిన ప్రయత్నాన్ని డాక్టర్ అంబేద్కర్ ఎంతో గర్వంగా ప్రశంసించారు. తన తోటి సభ్యుల విశేష

కృషినీ, రాజ్యాంగం ఆమోదం పొందటంలో కాంగ్రెస్ పార్టీ చూపిన అంకితభావాన్నీ డాక్టర్ అంబేద్కర్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయన చూపిన వినయాన్ని చూసి నేటితరం నేర్చుకోవాల్సి ఉంది.

రాజ్యాంగంలో లోపాలున్నాయని చాలామంది ఇప్పట్లో చేస్తున్న విమర్శలను డాక్టర్ అంబేద్కర్ అప్పట్లోనే లేవనెత్తి వాటికి సరైన సమాధానాలను ఇచ్చారు."రచనా కాలం నాటికి జాతికున్న ఆలోచనలను ప్రతిబింబిస్తూ రాజ్యాంగాన్ని రాస్తారని" థామస్ జఫర్‌సన్ చేసిన వ్యాఖ్యను డాక్టర్ అంబేద్కర్ ప్రస్తావించారు.

"పూజారులూ, న్యాయవాదులూ, మహోన్నతులని అనుకుని వారు చెప్పిన దానినే పరమసత్యంగా భావిస్తే గతాన్ని మనం నెత్తిన పెట్టుకోవాల్సి వస్తుంది, అదేవిధంగా మనం రాసినదాన్ని మన తర్వాతి తరం నెత్తిన రుద్దుతాం" అంటూ జఫర్ సన్ చేసిన హెచ్చరికను డాక్టర్ అంబేద్కర్ గుర్తు చేయడాన్ని మనం అర్థం చేసుకోవాలి.

అంతమాత్రం చేత భారత రాజ్యాంగ మౌలిక ప్రాతిపదికను, అందులోని శాశ్వత విలువలను చిన్నబుచ్చటాన్ని అంబేద్కర్ సుతరామూ ఆమోదించలేదు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన నవభారతం సహజమైన భావోద్వేగంతో ఎన్నో గొప్ప ఆదర్శాలను రాజ్యాంగంలో పెట్టుకున్నది. అవి అసాధ్యమైన అద్భుతాలనీ, వాటిని సాధించలేమని ఎవరూ భావించలేదు. కాలక్రమంలో సాధించాల్సిన, చేరుకోవాల్సిన గమ్యాలుగానే నాటి నేతలు భావించారు. వాటి సాధనకు అవసరమైన మార్గాలను పటిష్టంగా పొందుపరిచారు. అయితే ఆదర్శాలు గొప్పవి కావడం చాలదని వాటి అమలుకు చిత్తశుద్ధి అవసరమని డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించిన విషయం తెలిసిందే. "ఎంత మంచి రాజ్యాంగం అయినా అమలు చేసేవారు చెడ్డవారయితే దానివల్ల ప్రయోజనం ఉండదని" డాక్టర్ అంబేద్కర్ చేసిన వ్యాఖ్య గమనంలో ఉంచుకోవాలి.

ఆధునిక ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన, పౌరుల ప్రాథమిక హక్కులు, విధులు, పుట్టుకతో వివక్ష లేని సామాజిక న్యాయం, మత సామరస్యం, ప్రభుత్వాల ధర్మ నిరపేక్షత, శాస్త్రీయ, హేతు దృక్పథం, వంటి ఆదర్శాలు రాజ్యాంగ ప్రవేశికలో బలంగా పొందుపరచబడి ఉన్నాయి. వీటిని శాశ్వత విలువలుగా భావించడం వల్లనే రాజ్యాంగ మౌలిక చట్రాన్ని ఈ ఆదర్శాల ఆధారంగా రూపొందించారు.

అందుకే ఇన్నేళ్లుగా మౌలిక చట్రాన్ని మార్చడానికి వీలులేని పద్ధతిలో మన వ్యవస్థలు పనిచేస్తూ వచ్చాయి! కాలానుగుణంగా చేసుకునే మార్పులన్నీ మౌలిక చట్రం పరిధిలోనే ఉండేటట్లు మన సమాజం గట్టి సంకల్పంతో పనిచేస్తూ వచ్చింది. చట్టసభలు, రాజకీయ కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థ మధ్య పని విభజన, వాటి పరిధులు, యూనియన్, రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల మధ్య జరిగిన అధికార విభజన మన రాజ్యాంగంలోని బలాన్ని సూచిస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనిలో సమాఖ్య సహకార స్ఫూర్తిని ఒక అంతస్సూత్రంగా రాజ్యాంగం నొక్కి చెప్పింది. కుల, మత, ప్రాంతీయ, భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని సమున్నతంగా నిలపడానికి, సార్వభౌమత్వాన్ని, సమగ్రతను పరిరక్షించడానికి రాజ్యాంగం తగిన ఏర్పాట్లను చేసింది. పౌర హక్కులకు పాలకుల నుండి భంగం కలిగిన పలు సందర్భాల్లో మన న్యాయవ్యవస్థ తన పరిమితుల్లోనే క్రియాశీలంగా పౌరుల తరపున నిలబడింది.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చేస్తున్నదన్న సందర్భాల్లో రాష్ట్రాలు తమ హక్కుల కోసం నిలబడిన ఉదాహరణలు కూడా చాలా ఉన్నాయి. రాజ్యాంగాన్ని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడానికి పాలకులు ప్రయత్నించిన ప్రతిసారీ పౌర చైతన్యమే రాజ్యాంగాన్ని రక్షించుకుంటూ వస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ పెత్తందారీతనాన్ని వ్యతిరేకిస్తూ 1967 ఎన్నికల్లో ప్రజలు చెప్పిన తీర్పును, ఎమర్జెన్సీ నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ 1977 లో ప్రజలు చెప్పిన తీర్పును మన పౌర చైతన్యంలో అంతర్లీనంగా దాగిఉన్న ప్రజాస్వామ్య స్ఫూర్తికి రుజువుగా భావించాలి.

2047 నాటికి "నూరేళ్ల స్వాతంత్ర్యం" లక్ష్యాల కోసం దేశాన్ని సంసిద్ధం చేసే ప్రయత్నం జరుగుతున్న నేపథ్యంలో భారత రాజ్యాంగ మౌలిక స్వరూప స్వభావాలను, ఆదర్శాల స్ఫూర్తిని తర్వాతి తరాలకు అందించటానికి గట్టి ప్రయత్నం జరగాలి. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యం అందుకు ఒక సందర్భంగా పౌరసమాజం వినియోగించుకోవాల్సి ఉంది.

డి. సోమ సుందర్

# భారత రిపబ్లిక్ @75
# కొత్త రాజ్యాంగం అవసరమా?

*మన రాజ్యాంగం అమల్లోకి వచ్చి **2025** జనవరి **26**కి **75** ఏళ్లు పూర్తవుతాయి. భారత రిపబ్లిక్ అమృతోత్సవ మైలురాయిని అధిగమిస్తున్న సందర్భంగా ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు:*



**ప్రశ్న: రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. అని గత రెండు మూడేళ్లుగా.. ముఖ్యంగా ప్రతిపక్షం నుంచి వాదనలు వింటున్నాం. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇదో పెద్ద ప్రచారాస్త్రం కూడా అయ్యింది. రాజ్యాంగానికి ఈ వేళ ఏదైనా నిజమైన ప్రమాదం ఉందని మీరు భావిస్తున్నారా?**

**జేపీ:** అవి స్వార్థ రాజకీయ వాదనలు. నేను అధికారంలో ఉంటే అంతా అద్భుతం, మీరుంటే ప్రతిదీ వినాశం.. ఇది విపరీత పార్టీ రాజకీయ ధోరణి. అమెరికాలో కూడా చూస్తున్నాం. ఐరోపా కొంత సమతుల్యత పాటిస్తోంది.

మన రాజ్యాంగం అమలును లోతుగా పరిశీలిస్తే, ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రధాన రాజకీయ పార్టీలు మొత్తం రాజ్యాంగ స్వరూపంలో రెండు అంశాలనే పట్టించుకుంటున్నాయి. నిజాయితీగా మాట్లాడుకుందాం. ప్రజల ఓటు నుంచి అధికారం వస్తుంది, కాబట్టి ఏదోరకంగా ఆ ఓటు సంపాదించాలి. ఏ పద్ధతుల్ని అవలంబిస్తున్నారు, ఏం హామీ లిస్తున్నారు, ఆ హామీల అమలు సాధ్యమా వాళ్లకనవసరం. కులం, మతం, ప్రాంతం, భాష విభజనలు చేయటానికీ వెనుకాడరు. ఏదోరకంగా ఓట్లు, సీట్లు కావాలంతే. రెండోది, చట్ట సభలో మెజారిటీ సంపాదించినవాడు రాజవుతాడు. ఈ రెండు విషయాల్నీ మాత్రం పక్కాగా అర్థం చేసుకున్నాయి. వీటిల్లో తూ.చ. తప్పకుండా రాజ్యాంగాన్ని, స్ఫూర్తిని పాటిస్తున్నాయి. ఓడిపోతే మాత్రం ఈ స్ఫూర్తి కూడా కొరవడుతుంది. ఎన్నికల్ని రిగ్గింగ్ చేశారనే ఆరోపణలు చేయటానికీ సంకోచించడం లేదు. కొన్ని పార్టీలు ఎన్నికల ప్రక్రియని కూడా ప్రశ్నిస్తున్నాయి. రాజ్యాంగ విరుద్ధమన్నట్లు మాట్లాడుతున్నాయి. అవి మినహాయించి, రాజ్యాంగానికున్న సమున్నత పాత్రను పార్టీలు పట్టించుకోవడం లేదు. ప్రజలమైన మేము, అని ప్రజల పేరున రాసిన రాజ్యాంగాన్ని, చట్టాల్ని ఉపయోగించి ప్రజల సాధికారత, అధికార వికేంద్రీకరణ, చట్టబద్ధపాలన, పౌరసేవలు, జనం పన్నుల డబ్బుకు తగిన విలువను చేకూర్చటం, వారి జీవితాల్ని మెరుగు పరచటంలో మనం ఘోరంగా విఫలమయ్యాం. ఈ రాజ్యాంగ మౌలిక లక్ష్యాల ప్రమాణాల ప్రకారం చూస్తే మనం సోదిలో కూడా కనిపించం. కాబట్టి అసెంబ్లీ లేదా పార్లమెంటులో మెజారిటీ సంపాదించి అధికారంలోకి రావడం, అధికారంలో కొనసాగటం ప్రధాన పార్టీలు రాజ్యాంగం ద్వారా చూస్తున్న ప్రయోజనం. కాలక్రమంలో రాజకీయ వ్యవస్థ రాజ్యాంగ స్ఫూర్తి, విలువల పట్ల మొద్దుబారి పోయింది. అధికార క్రీడలో రాజ్యాంగాన్ని పణంగా పెట్టటంలో పార్టీల మధ్య పెద్దగా తేడా లేదు.

నిశితంగా పరిశీలిస్తే దేశ సుస్థిర మనుగడ, అభివృద్ధిలో మన రాజ్యాంగం గొప్ప అసాధారణ పాత్ర పోషించింది. రకరకాల విభజనలు, వైవిధ్యాలు, ప్రపంచంలోనే ఎక్కడా లేనంత సంక్లిష్ట భిన్నత్వం ఉన్న ఒక ప్రాచీన సమాజంలో అందరినీ కలపటం, భారతదేశ ఐక్యతను కాపాడటం, మనమందరం ఒక ఛత్రం కింద ఒకే దేశంగా ఉన్నాం అన్న భావనను కలిగించటం ఆషామాషీకాదు. అదే విధంగా నిచ్చెన మెట్ల, వివక్షాపూరిత కుల వ్యవస్థ ఉన్న దేశంలో మనందరికీ ఒకే పౌరసత్వం, సమాన హక్కులు, కలలు నెరవేర్చుకోవటానికి సమానావకాశాల భరోసాను రాజ్యాంగం అందించింది. సంస్థానాల విలీనం కావచ్చు, రాష్ట్రాల పునర్విభజన కావచ్చు. కీలక ప్రక్రియల్లో

రాజ్యాంగం మార్గం నిర్దేశించింది. ఇవన్నీ రాజ్యాంగం మనకిచ్చిన అద్భుత అవకాశాలు, మనకు చూపించిన గొప్ప పరిష్కారాలు. కానీ కాలక్రమంలో ఏదో రకంగా ఓటు ద్వారా అధికార సముపార్జనకు, ఏదో రకంగా రాజ్యాంగ పద్ధతుల్లో అధికారాన్ని నిలబెట్టుకోవడానికే ప్రధానంగా రాజ్యాంగం పరిమితమైంది. ఆ రకంగా చూస్తే ఏ లోతైన లక్ష్యం కోసం, ఏ స్ఫూర్తి అమలు కోసం రాజ్యాంగం మొదలైందో అవి విస్మరణకు గురయ్యాయి. కానీ ఏదో ఒక పార్టీ రాజ్యాంగానికి ప్రమాదకరంగా మారింది; మిగిలిన పార్టీలన్నీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నాయనటం స్వార్థ రాజకీయ స్వోత్కర్ష.

**ప్రశ్న: రాజ్యాంగం ఎంతో సమర్థంగా, బహుముఖంగా దేశ ప్రయోజనాల్ని పరిరక్షించిందని మీరు చెబుతున్నారు. ఒక లిఖిత రాజ్యాంగం సగటు జీవితకాలం 19, 20 ఏళ్లుగా అంచనా. మన రాజ్యాంగం 75వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. సంస్థానాల కాలం నుంచి చూసినా మనదెంతో భిన్నత్వమున్న సమాజం. ఒక దేశంగా మనల్ని ఏకం చేయటంలో రాజ్యాంగం ఎటువంటి పాత్ర పోషించింది.**

**జేపీ:** భారత్‌లో అనేక అసాధారణ పరిణామాలు సాధ్యమయ్యాయి. ప్రజాస్వామ్య ఏర్పాటు మనకు ఎంత అలవోకగా జరిగిందంటే, ఆ విలువను మనం అర్థం చేసుకోలేదు. మన జాతి నిర్మాతలు, రాజ్యాంగ నిర్మాతలు కేవలం 1946లో కూర్చుని 1949లో రాజ్యాంగ రచన పూర్తి చేసిన వారు కాదు. అంతకు ముందు వారు జాతి నిర్మాణం చేశారు. కనీసం ఓ 60–70 ఏళ్ల పాటు కులం, మతం, ప్రాంతం, భాష, వివిధ రకాల సాంస్కృతిక భావోద్వేగాలతో చీలికలు పీలికలుగా ఉన్న సమాజంలో 'ఒకే దేశం' అనే భావన నిర్మించటానికి వాళ్లు 1857 తర్వాత కాలం నుంచి అలుపెరగని కృషి చేశారు. సుమారుగా 1860ల కాలం నుంచి సాగిన ఈ కృషిలో ముందుగా మధ్యతరగతి వారిని చైతన్యపరిచారు. ఆ తర్వాత తిలక్, తదనంతరం మహాత్మా గాంధీ సామాన్య ప్రజల్లో జాతీయ భావాన్ని రగిల్చే ఉద్యమాన్ని నిర్మించారు. రాజ్యాంగ స్ఫూర్తి, సంస్కృతి ప్రజలకు పూర్తిగా అర్థం కాకపోవచ్చు. కానీ మనల్ని మనం పరిపాలించుకునే హక్కు, పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు, సమాజంలో ప్రతి ఒక్కరి పట్ల విధిగా గౌరవం, విలువ వంటి భావనలు మనలో ఇంకిపోయాయి. ప్రతి ఒక్కరిలో ఈ భావాలు పాదుకున్నాయనటం లేదు. కానీ గణనీయ సంఖ్యలో మన సమాజంలోని అన్ని వర్గాల్లో ఇవి జీర్ణించుకుపోయాయి. ఇది మన నాయకుల అసాధారణ కృషి, విశ్వసనీయతల వల్ల సాధ్యమైంది. తమ కష్టం, త్యాగం, మేధస్సుతో ప్రజల్ని ఏకం చేసే సామర్థ్యంతో వారు ప్రజల్లో ఈ నమ్మికను సాధించారు. రాజ్యాంగ నిర్మాణం మనలాంటి సమాజంలో అందుకే సాధ్యమైంది. రాజ్యాంగ సభలో లోతైన తర్జనభర్జనలు జరిగాయి. కానీ అవన్నీ స్నేహపూర్వక చర్చలు, సామరస్య వాతావరణంలో జరిగాయి. ఎంత వాదోపవాదాలు జరిగినా అమీతుమీ తేల్చుకునేలా జరగలేదు. ఒకరిపై ఒకరు చేతుల విసురుకోలేదు. ద్వేషం లేదు. అపనమ్మకం లేదు. విభిన్న దృక్పథాల మధ్య సయోధ్యని, ఏకాభిప్రాయాన్ని సాధించారు. అదే, ఈ వేళ పరిస్థితి చూడండి.

రాజ్యాంగ నిర్మాణ స్థాయి అంశాలు అలా ఉంచితే, రాజ్యాంగ పద్ధతుల అమలుపై మాటల్లోనే ఎంత గందరగోళం ఉంది ఈ వేళ! పరస్పర నమ్మకం లేదు. లెబనాన్‌లాంటి చిన్న దేశాన్నే చూడండి, బెల్జియం లాంటి నాగరిక సంపన్న దేశాన్ని తీసుకున్నా అపనమ్మకం. బెల్జియంలో ఫ్లెమిష్ ప్రజలు ఫ్రెంచి వాళ్లను నమ్మరు. ఇద్దరూ కూడా దేశాన్ని దాదాపు రెండు ముక్కలు చేశారు. లెబనాన్‌లో సున్నీ ముస్లింలు, యూదులు, షియాలు, మెరొనైట్ క్రైస్తవులు, ఇతర ప్రజలు ఒకరినొకరు నమ్మరు. వాళ్లలో వాళ్లు కొట్టుకుంటున్నారు. సైప్రస్ చాలా చిన్న దేశం. ఉత్తర సైప్రస్, దక్షిణ సైప్రస్ వేరుపడ్డాయి. అదే, ఇంత వైవిధ్యమున్న భారతదేశంలో రాజ్యాంగాన్ని అలవోకగా అమల్లోకి తెచ్చారు. మన జాతి నిర్మాతలకు గొప్ప నివాళి ఇది! వారి కృషిని ఎన్నడూ తక్కువగా అంచనా వేయొద్దు. అదే విధంగా స్వతంత్రం వచ్చిన మొదటి పది, పదిహేనేళ్లు ఆర్థిక విధానపరంగా మనం దేశాన్ని దారుణంగా దెబ్బతీశాం గానీ, రాజ్యాంగ వ్యవస్థల నిర్మాణంలో అద్భుతమనదగ్గ కృషి చేశాం తొలినాళ్లలో.

రాజ్యాంగానికి సంబంధించిన రెండో గొప్ప విషయం సరళత! మూలాలు, వాటిలోని మౌలికాంశాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. అందరికీ వయోజన ఓటు హక్కు, ప్రాథమిక హక్కులు, ఎన్నికల ప్రజాస్వామ్యం, ఫెడరలిజం మొదలైనవి. వీటిల్లో వివరాల్ని కాలానుగుణంగా, పరిస్థితుల్ని బట్టి ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు ఉంది. దీనివల్లే పెద్ద గందరగోళం లేకుండా 100కి పైగా సార్లు రాజ్యాంగాన్ని సవరించుకోగలిగాం. ఒకే ఒక్కసారి రాజ్యాంగాన్ని దెబ్బతీసేలా సవరణ జరిగింది. ఎమర్జెన్సీ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ. మిగతా అన్ని సందర్భాల్లో రాజకీయ పార్టీలు చాలా వరకు పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లకు స్పందించి ఎప్పటికప్పుడు రాజ్యాంగాన్ని సవరించాయి.

ఇక్కడ న్యాయవ్యవస్థ పాత్ర గురించి కూడా చెప్పుకోవాలి. సుప్రీంకోర్టు రాజ్యాంగానికి సంబంధించి కొన్ని అంశాల్లో విజ్ఞతతో వ్యవహరించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని కేశవానంద భారతి కేసులో పార్లమెంటుకు స్పష్టం చేసింది. మీరు రాజ్యాంగాన్ని సవరించగలరు కానీ మూల స్వరూపాన్ని మార్చలేరు. రాజ్యాంగ అంతర్లీన మౌలిక విలువల్ని మార్చటానికి వీల్లేదని ఇటీవల 2024లో ఇచ్చిన తీర్పులో కూడా పేర్కొంది. కేశవానంద భారతి కేసులో తీర్పు ఎంతో విజ్ఞతాయుతమైనది. అయితే, అందులో ఒక తప్పు ఏమిటంటే రాజ్యాంగ మౌలిక విలువలు ఏవనేది స్పష్టం చేయటానికి కోర్టు నిరాకరించింది. అవసరాన్ని బట్టి ఎప్పుడైనా కోర్టు ఏకపక్షంగా నిర్ణయిస్తుందన్నట్టు వీటిని నిర్వచించకుండా వదిలేశారు. అది తప్పు. కానీ ఆ తీర్పులోని మౌలిక భావన సరైనది. మన రాజకీయ వ్యవస్థ వాస్తవంగా అందుకు కట్టుబడి వ్యవహరిస్తోంది, ఆ పరిధిలో సవరణలు చేస్తోంది. కాబట్టి దృఢత్వంతో పాటు సరళత్వం ఉన్న రాజ్యాంగం మనది.

మూడోది, కాలక్రమంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక అనివార్యతల ప్రభావం, ఆర్థిక సంస్కరణలు ప్రపంచంలో కొన్ని కీలక మార్పుల్ని తీసుకొచ్చాయి. మన దేశంలో రాజకీయ గుత్తాధిపత్యం పోయి వివిధ రాష్ట్రాల్లో వివిధ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. వీటిలో పలు ప్రాంతీయ పార్టీలున్నాయి. ఈ రాజకీయ ఆర్థిక, నేపథ్యంలో, కనీసం రాష్ట్రస్థాయిలో ఫెడరలిజం బాగా బలపడింది. కాబట్టి మనం 1950 నాటి రాజ్యాంగం వద్ద ఆగిపోలేదు. రాజ్యాంగ విలువలు వాస్తవంగా కొన్ని కోణాల్లో విస్తరించాయి. కొన్ని కోణాల్లో దిగజారాయనటంలో సందేహం లేదు. కొన్ని కోణాల్లో మెరుగుపడ్డాయి. భారత్ గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఈ వేళ ఫెడరల్ దేశం. కానీ రాజ్యాంగ రచనా సమయంలో గందరగోళం వల్ల ఒక లోపం చోటు చేసుకుంది. అది ఇప్పటికీ సరికాలేదు. మనం ఎప్పుడూ మూడో అంచె ఫెడరలిజం గురించి పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే అగ్ర కులాల పెత్తనం పట్ల డాక్టర్ అంబేద్కర్‌కున్న అపనమ్మకం వల్ల స్థానిక ప్రభుత్వాలు పట్టాలు ఎక్కలేదు. అయితే. కుల ఆధిపత్యానికి తేలికైన పరిష్కారం ఉంది.

సాంప్రదాయ గ్రామం స్థానంలో విస్తృతమైన కొన్ని గ్రామాల సముదాయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటే కుల వివక్షపై ప్రజాస్వామ్య సంస్థలు ఆధిపత్యం సాధించగలిగేవి. ఒక గ్రామంలో కులాల వారీగా ఆవాసాలుంటాయి. సంప్రదాయబద్ధంగా పుట్టుక కారణంగా గ్రామంలో ఆధిపత్య ధోరణి ఉంటుంది. కానీ అదే కొన్ని గ్రామాలని కలిపితే సంప్రదాయం స్థానంలో సంఖ్యాబలం రాజ్యమేలుతుంది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో జరిగేది అదే. పరిష్కారాన్ని చూడకుండా మనం ఇష్టానుసార పద్ధతిలో వ్యవహరిస్తూ స్థానిక ప్రభుత్వాలని కీలుబొమ్మలుగా, ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాం. కొన్ని దశాబ్దాల తర్వాత, రాజ్యాంగ సవరణ తీసుకొచ్చాం గానీ, అనాలోచితంగా రూపొందించాం. సదుద్దేశంతోనే అయినా లోపభూయిష్ట రీతిలో చేశాం. పటాటోపం తప్ప నిధులు, విధులు లేని స్థానిక ప్రభుత్వాలను తయారు చేశాం. ఈ వైఫల్యం వల్ల మూడో అంచె ఫెడరలిజం పరిణతి చెందడం లేదు. ఇది మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యంలో పెద్ద బలహీనత.

> **మనం 1950 నాటి రాజ్యాంగం వద్ద ఆగిపోలేదు. రాజ్యాంగ విలువలు వాస్తవంగా కొన్ని కోణాల్లో విస్తరించాయి. కొన్ని కోణాల్లో దిగజారాయనటంలో సందేహం లేదు. కొన్ని కోణాల్లో మెరుగుపడ్డాయి. భారత్ గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఈ వేళ ఫెడరల్ దేశం. కానీ రాజ్యాంగ రచనా సమయంలో గందరగోళం వల్ల ఒక లోపం చోటు చేసుకుంది. అది ఇప్పటికీ సరికాలేదు.**


కానీ రెండో అంచె చాలా చాలా బలపడింది. నా మాటల్ని రాసి పెట్టుకోండి, భారతదేశ భవిష్యత్తు రాష్ట్రాల్లో ఉంటుంది.! రాష్ట్రాలే సమాధానం. భారత్‌లో రోజువారీ పరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వాలు కీలకం. యూనియన్ ప్రభుత్వ పాత్ర ప్రజల దైనందిన జీవితంలో పరిమితమే. ఈ మార్పు గత 40-50 ఏళ్లలో చోటు చేసుకుంది. కాబట్టి ఏరకంగా చూసినా మన రాజ్యాంగం కాల పరీక్షను తట్టుకుని నిలబడింది.

దానర్థం, రాజ్యాంగంలో రాసిన ప్రతి మాటా జవదాటకూడని పవిత్రమైనదని, మనం మార్చకూడదని కాదు. మన జాతీయోద్యమ, రాజ్యాంగ నిర్మాతలు అటువంటి జడత్వాన్ని ఎప్పుడూ కోరుకోలేదు. కానీ మౌలికంగా మన రాజ్యాంగంలో ఎటువంటి లోపం లేదు. ఇది సరైన రీతిలో ఆమోదం, సరైన అంశాలు కలిగిన సరైన పత్రం. సమకాలీనత గల సజీవపత్రం. స్థానిక ప్రభుత్వాలు లాగా మనం సవరించుకోవాల్సిన అంశం ఏదైనా ఉంటే,

రాజ్యాంగం ఎటువంటి అవరోధం కాబోదు. స్థానిక ప్రభుత్వాల్ని బలోపేతం చేయాలని నేను బలంగా కోరుకుంటాను.

**ప్రశ్న: కొంతమంది మితవాదుల్లో, ఉదారవాదుల్లో కూడా ఒక అభిప్రాయం ఉంది. రాజ్యాంగ పీఠికలో సోషలిజం, సెక్యురిలజం పదాల పట్ల వారి అభ్యంతరాన్ని మీరెలా చూస్తారు.**

**జేపీ:** నా మిత్రుడు, నా మార్గదర్శి, నేనంతో అభిమానించే శరద్‌జోషి ఎప్పుడూ అంటుండేవారు– డాక్టర్ జయప్రకాష్! సోషలిజం అనే పదం అంటే నాకు ఎలర్జీ. రాజ్యాంగంలోకి దాన్ని జొప్పించడం పూర్తిగా తప్పు. మనం దాన్ని ఎప్పుడూ అంగీకరించం, మనం పోరాడాలి అని. నేను నవ్వుతూ చెప్పేవాడ్ని– వాటి మీద పోరాటం అనవసర ప్రయాస. సోషలిజానికి మీ మాటల్లో నిర్వచనం ఇచ్చుకోండి చాలు. సోషలిజం అంటే ఏమిటి? మొత్తం ఆర్థిక వ్యవస్థను నియంత్రించటం అని ఒకరు అంటారు. ప్రభుత్వం ఆర్థిక రంగాన్ని నిర్దేశిస్తూ గుత్తాధిపత్యం చెలాయించాలని. అది కాలం చెల్లిన సిద్ధాంతం. మనం 1991లోనే దానికి తిలోదకాలిచ్చాం. ఎంతోకొంత విజ్ఞత కలగటంతో దాదాపు ప్రపంచమంతా ఆ వాదాన్ని వదిలేసింది. కానీ నా దృష్టిలో సోషలిజం అంటే, యాదృచ్ఛికంగా జరిగే పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాన్ని అందించటం. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం, హుందాగా, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం లభించటం. అదీ నా సోషలిజం. ఆ నిర్వచనం పట్ల నేను పూర్తి సంతోషంగా ఉన్నాను. మీ పద్ధతిలో మీరు సోషలిజాన్ని నిర్వచించుకోండి. దాని కోసం ఎందుకు కొట్లాడటం? ఒక సువిశాల, సంక్లిష్ట దేశంలో మార్చాల్సిన విషయాలు అనేకం ఉన్నాయి. ప్రజల జీవితాలపై నిజమైన ప్రభావం చూపే ఆ కీలకాంశాలపై మీరు దృష్టి కేంద్రీకరించాలి. మనం అలవాటుగా వాదోపవాదాల్లో చిక్కుకుని, ప్రయోజనం లేని స్వల్ప విషయాలపై మన శక్తియుక్తుల్ని వృథా చేస్తే క్రియాశూన్య ఊహల్లో విహరిస్తున్నట్టు. లౌకికవాదం రాజ్యాంగంలోనే అంతర్భాగంగా ఉంది. ఆ పదం ఉండొచ్చు, ఉండక పోవచ్చు. సోషలిజం ఎప్పుడూ రాజ్యాంగంలో అంతర్భాగంగా లేదు. సోషలిజాన్ని సోవియట్ తరహా ప్రభుత్వంగా, ప్రభుత్వ గుత్తాధిపత్యంగా అర్థం చేసుకోవటం అర్థరహిత ఆలోచన. సోషలిజం అంటే ప్రతి ఒక్కరికీ సమానావకాశం. అది అవసరమైన ఆలోచన. మనం దాన్ని స్వీకరించాలి. అక్కడక్కడా ఒకటి, రెండు పదాల గురించి మనం అతిగా స్పందించాల్సిన అవసరం లేదు.




**ప్రశ్న: రాజ్యాంగం మన ప్రగతికి, అభివృద్ధికి పరిమితిగా ఉందని రాజకీయపార్టీలు, కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. ఈ వేళ్టి పరిస్థితులకనుగుణంగా కొత్త రాజ్యాంగాన్ని తయారు చేసుకోవాలని వారంటున్నారు.**

**జేపీ:** ఈ వాదన ఏమాత్రం వాస్తవం లేనిది. ఆ మాట ఖచ్చితంగా చెప్పగలను. రాజ్యాంగం ఏం చేస్తుంది? రాజ్యాంగమేమీ మంత్రదండం కాదు. ఏదో మంత్రాన్ని జపిస్తే ఓ గొప్ప మార్పు దానంతటది జరగదు. నిన్ను నువ్వు పరిపాలించుకోవటానికి, నిన్ను నువ్వు క్రమబద్ధీకరించు కోవటానికి రాజ్యాంగం నీకో చట్రాన్ని అందిస్తుంది. ఆ పరిధి లోపల నీ సామర్థ్యంతో ఏం చేయాలి, పాలనతో ఏం చేయాలి అనేవి నీ చేతుల్లో ఉంటాయి. ఏం చేయాలో రాజ్యాంగం ఎప్పుడూ నీకు చెప్పదు. ఎలా చేయాలో నీకు చెబుతుంది. మనం గందరగోళానికి గురవుతున్నాం. ఎలా చేయాలి అనే భాగం ఇంతకంటే మెరుగ్గా ఉండదు. నిజమే, కొన్ని విభాగాల్లో మనం మెరుగుపరుచుకోవటం అవసరం. మనం ఇప్పటి దాకా 106 రాజ్యాంగ సవరణల్ని తెచ్చుకున్నాం. రాజ్యాంగం చాలా స్పష్టంగా అందుకు అవకాశం కల్పించింది. ఆ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మినహాయించి, మీరు దిద్దుబాట్లు చేసుకోవచ్చని కోర్టులు స్పష్టం చేశాయి. కాబట్టి, రాజ్యాంగం పనిచేయలేదు. కొత్త రాజ్యాంగం అవసరమనే వాదన హేతురహితం.

ఉదాహరణకు మీరు ప్రస్తావించిన అభివృద్ధి! అభివృద్ధికి ఏం కావాలి? ఆర్థిక క్రమశిక్షణ కావాలి, తమ డబ్బు ఎటుపోతోంది, ఆ డబ్బుతో ఏం జరుగుతోంది, భవిష్యత్తును నిర్మిస్తున్నారా, మొత్తం డబ్బును ఈ వేళ తాత్కాలిక అవసరాలకు ఖర్చు చేస్తున్నారా అని ప్రజలు తెలుసుకోవటానికి వీలుగా అధికార వికేంద్రీకరణ,

పౌరసేవల్ని నాణ్యంగా, సమర్థంగా అందించటం, ముఖ్యంగా మంచి విద్య, ఆరోగ్యం, నాణ్యమైన మౌలిక వసతులు, సొంతం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే అధికార యంత్రాంగం, నిజాయితీ, ప్రజాసేవా తత్పరత ఉన్న రాజకీయ వ్యవస్థ కావాలి. చెప్పండి వీటిల్లో ఏ ఒక్కటైనా చేయకుండా రాజ్యాంగంలోని ఏ నిబంధన మిమ్మల్ని అడ్డుకుంటుంది? గతంలో మనం భూముల్ని సమీకరించలేకపోతున్నామని, రహదారులు నిర్మించలేక పోతున్నామని వాపోయాం. కానీ ఈ వేళ మనం రోజుకు 30 కిలోమీటర్ల జాతీయరహదారి నిర్మిస్తున్నాం. అందుకోసం రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం కలగలేదు కదా! ఉన్న రాజ్యాంగ పరిధిలోనే సమర్థంగా వ్యవ హరిస్తున్నాం. అంతకుముందు మనకు ప్రభుత్వ గుత్తాధిపత్యం ఉండేది. పోటీని అనుమతించకుండా ఫోన్‌లు కూడా రాకుండా చేశారు. మౌలిక అవసరాలు అందించ లేదు. ప్రతి దానికీ నియంత్రణలు, అవినీతి, ఈ వేళ ఆర్థిక సంస్కరణల తర్వాత వస్తు, సేవలు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి వచ్చాయి. పోటీ ఉంది. ప్రజలకు ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. ధరల్ని మార్కెట్ నిర్ణయిస్తుంది. నాణ్యతను మార్కెట్ నిర్ణయిస్తుంది. నచ్చిన వస్తువును, నచ్చిన చోట కొనుక్కుంటారు. అది చేయకుండా రాజ్యాంగం ఎక్కడ మిమ్మల్ని అడ్డుకుంది? తమ విధానాల్లో చట్టాల్లో , చర్యల్లో మన రాజకీయపార్టీల, ప్రభుత్వాల మూర్ఖత్వమే అసలు సమస్య.

పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందివ్వద్దని రాజ్యాంగంలో ఎక్కడ చెప్పారు? మీరు అందివ్వలేదు. రాజ్యాంగాన్ని తిరగరాయడం విద్యలో, ఆరోగ్యంలో నాణ్యతను ఏ రకంగా పెంచుతుంది? ఈ రెంటిని మెరుగుపరచకుండా మీరు సమాజంలో సమానత్వాన్ని ఎలా తీసుకొస్తారు? తప్పు రాజ్యాంగానిది కాదు..ఇంతకు ముందు నేను ప్రస్తావించి నట్లు, అధికారాన్ని సంపాదించడం, అధికారాన్ని నిలబెట్టు కోవడం వరకు తప్ప రాజ్యాంగ స్ఫూర్తి గురించి మన దేశంలో రాజకీయ వ్యవస్థ సరిగా పట్టించుకోలేదు. అధికారానికి ఆవల రాజ్యాంగం గురించి పైపై మాటలు తప్ప, మనకు లెక్కలేదు. అధికార పీఠమెక్కటం, ఆ పదవిని కాపాడుకోవడం వరకు మాత్రం రాజ్యాంగం మనకు పరమ పవిత్రం. ఇది మన వైఫల్యం, ముఖ్యంగా సమాజాన్ని శాసించే అధికారవర్గాల వైఫల్యం, అధికార యంత్రాంగం వైఫల్యం తప్ప రాజ్యాంగ వైఫల్యం కాదు.

కొన్ని మార్పులు మాత్రమే రాజ్యాంగానికి అవసరం. మనం 73, 74 రాజ్యాంగ సవరణల్ని ప్రవేశపెట్టాం. లక్ష్యం అర్థవంతమైనది, నిర్మాణం పేలవమైనదని నేను ఎప్పుడూ చెబుతుంటాను. ఈ దేశానికి పునాదిగా ఉండే స్థానిక ప్రభుత్వాలని మీరు హాస్యాస్పదం చేశారు. వాటిని మీరు మెరుగుపరిచి తీరాలి. రాజ్యాంగానికి వక్రభాష్యంతో ఆ సవరణల్ని కాస్తా సమస్యగా చేశాం. అత్యంత అధ్వాన్నంగా రూపొందించాం. వాటిని మనం అర్థవంతంగా, జర్మనీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 28 తరహాలో లేదా ఇతర దేశాల్లోని ఏర్పాట్ల తరహాలో రూపొందించగలం. సర్పంచ్‌ని ఎలా ఎన్నుకోవాలో ఏ రాజ్యాంగమూ మీకు చెప్పదు. సాధికారతగల, స్వయం పాలనాధికారం గల స్వతంత్రప్రతిపత్తి, జవాబుదారీతనం గల స్థానిక ప్రభుత్వాలు ఉండాలని మాత్రమే ఆ దేశాల రాజ్యాంగాలు చెబుతాయి. మనం తప్పుగా సవరణ రాశాం. లోపం రాజ్యాంగ నిర్మాణంలో లేదు. ఆ తర్వాత మనం చేసిన తప్పిదంలో ఉంది. మనం దాన్ని సరిదిద్దాలని ఎప్పుడూ అనుకోలేదు. ఈ రాజ్యాంగ సవరణ ఎంత తప్పుల తడకగా ఉందంటే, అది చేయకముందు డజన్ల కొద్దీ ముఖ్యమంత్రులు స్థానిక ప్రభుత్వాలు నుంచి వచ్చారు. ఈ రాజ్యాంగ సవరణలు చేసిన 1990ల నుంచి ఇప్పటి వరకు కేవలం ఒకే ఒక్క ముఖ్యమంత్రిని స్థానిక ప్రభుత్వాలు అందించగలిగాయి. దేవేంద్రఫడ్నవిస్. ఆయన నాగపూర్‌కి మేయర్‌గా పనిచేశారనుకుంటా. అలా అంచెలంచెలుగా ఎదుగుతూ ముఖ్యమంత్రి అయ్యారు. ఇది సవరణలు రూపొందించడంలో మనం చేసిన తప్పు. రాజ్యాంగ నిర్మాతల తప్పుకాదు. దీన్ని మనం మార్చగలం. కొన్ని సాంకేతికాంశాలుండొచ్చు. ఆర్థిక సుస్థిరత కోసం మరింత వెసులుబాటు కల్పించగలము, ఆర్థిక సంఘాన్ని శాశ్వతం చేయగలము. ఇవన్నీ సాంకేతికాంశాలు. రాజ్యాంగాన్ని సవరించకుండా మనల్ని ఏదీ నిరోధించడం లేదు.

రాజ్యాంగాన్ని తప్పుబడుతున్నవారందరినీ కోరుతున్నా– ఆలోచించండి. మీరు రాజకీయ పాలనా ప్రక్రియకు, రాజ్యాంగానికి మధ్య తికమకపడుతున్నారు. తప్పు రాజ్యాంగంలో లేదు. రాజ్యాంగం మనల్ని విఫలం చేయలేదు. పాలనలో ఉన్న మన పెద్దలు, రాజకీయంలో కావచ్చు, అధికార యంత్రాంగంలో కావచ్చు, చివరికి న్యాయవ్యవస్థలో కావచ్చు - కలిసికట్టుగా భారత రాజ్యాంగాన్ని విఫలం చేశారు.

కాబట్టి మనం రాజకీయ నిర్మాణాన్ని మార్చుకోవాలి. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలి. రాజకీయాల్లో అక్రమ డబ్బు ప్రభావాన్ని నిర్మూలించే ఎన్నికల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఈ రకమైన ఎన్నికల పద్ధతికి మారటానికి రాజ్యాంగం అవకాశం ఇస్తోంది. అధికారులు,

ఇతర ప్రభుత్వోద్యోగులను, వ్యవస్థలను మరింత జవాబుదారీ చేయాలి. భవిష్యత్తును కాపాడేలా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. ఇవన్నీ రాజ్యాంగ చట్రం పరిధిలోనే ఉన్నాయి. తేలిగ్గా సాధ్యం.

ఈ వేళ మీరు నిజంగా రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చాలనుకుంటే, కొంతమందికి నిజంగా ఆ పనిచేసే రాజకీయ శక్తి ఉంటే, నేను గ్యారంటీ ఇస్తున్నాను. అదో వినాశనమవుతుంది. జీవితంలో రెండు విషాదాలుంటాయని ఆస్కార్ వైల్డ్ చెప్పాడు. మొదటి విషాదం జీవితంలో నువ్వు కోరుకున్నది సాధించకపోవడం. రెండోది నువ్వు కోరుకున్నది సాధించడం. కాబట్టి ఏం కావాలో జాగ్రత్తగా ఆలోచించి కోరుకోవడం మనకు అవసరం. మీరు గనుక నిజంగా కొత్త రాజ్యాంగాన్ని కోరుకుంటే, నేను నిస్సంకోచంగా చెప్పగలను. ఒక ఉదాత్తమైన రాజ్యాంగాన్ని రాసే శక్తి ఒక సమాజంగా ఈ వేళ మనకి లేదు.

**ప్రశ్న: ఎందుకు అలా సర్?**


**జేపీ**: ఈ దేశంలో రూపొందించిన చట్టాల్లో చూడండి. రాజ్యాంగ సవరణల్ని చూడండి. 73,74 సవరణలు ఎంత మొక్కుబడిగా చేశారో, చాంతాడంత పొడుగున–అమెరికన్ రాజ్యాంగం కంటే సుదీర్ఘంగా 7,700 పదాలతో చేపట్టిన–రాసిన ఆ సవరణలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో పేలవమయిన, జీవచ్ఛవం లాంటి స్థానిక ప్రభుత్వాలకి ఎలా రూపకల్పన చేశారో, ఒక గొప్ప అవకాశాన్ని ఎలా వృధా చేసి జాతికి నష్టం చేశారో చూస్తే మనకీనాడు మంచి రాజ్యాంగాన్ని రూపొందించే నైపుణ్యం కరువయిందని అర్థమవుతుంది.

మరో ఉదాహరణ చెబుతున్నా– 97వ రాజ్యాంగ సవరణ. అప్పట్లో అధికారంలో ఉన్న వాళ్లని ఒప్పించి ఆ రాజ్యాంగ సవరణ రావటంలో నేను కీలకపాత్ర పోషించాను. సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి భరోసా కల్పించే రాజ్యాంగ బిల్లు. ఆ రాజ్యాంగ సవరణలు ఎలా రాశారో చూడండి. 'కేంద్రప్రభుత్వం' అనే వ్యక్తీకరణను మొట్టమొదటిసారిగా రాజ్యాంగంలోకి చేర్చారు. అదిచూపినప్పుడల్లా, నా శరీరం కుచించుకుపోతుంది. రాజ్యాంగంలో ఎక్కడా మనం కేంద్రప్రభుత్వం అన్న పదం వాడం. ఏదో అలవాటు ప్రకారం అధికారులు, లేకపోతే రాజకీయ నేతల ప్రసంగంలో వాడటం తప్ప రాజ్యాంగ నిర్మాతలు ఆ పదాన్ని ఎక్కడా ఉపయోగించలేదు. ఉన్నది యూనియన్, సమాఖ్య ప్రభుత్వం మాత్రమే. పాలనకు పౌరురాలు, పౌరుడు కేంద్రబిందువు. రాజ్యాంగం ఈ విషయంలో చాలా స్పష్టతతో ఉంది. కానీ ఈ రాజ్యాంగ సవరణలో ఆ పదాన్ని తెచ్చారు. అదే విధంగా, 97వ రాజ్యాంగ సవరణలో మరో పొరబాటు రాశారు. చట్టం ఎప్పుడూ రాజ్యాంగానికి లోబడి ఉంటుంది. నిబంధన చట్టానికి లోబడి ఉంటుంది. ప్రభుత్వ లేదా అధికారిక ఆదేశం నిబంధన పరిధిలో ఉంటుంది. కానీ ఈ సవరణలో వాళ్లు ఏం రాశారో తెలుసా; బ్యాంకింగ్ నియంత్రణ చట్ట నిబంధనలకు లోబడి..వగైరా వగైరా అని రాశారు. బ్యాంకింగ్ నియంత్రణ చట్టానికి వాళ్లు రాజ్యాంగం కంటే ఎక్కువ స్థాయిని కల్పించారు. వాళ్ల ఉద్దేశం అది కాదు. కానీ పేలవమైన రూపకల్పన, అరకొర నైపుణ్యం. ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంకింగ్ నియంత్రణ ముఖ్యం కాబట్టి, వాళ్లు రాసి ఉంటారు. బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రించటానికి సంబంధించిన ఏ చట్టానికైనా లోబడి అని. ఒక సరైన పత్రాన్ని రాసే నైపుణ్యం, స్థాయి కూడా కొరవడుతోంది.

రెండోది ఈ వేళ్టి భారతదేశంలో ఏ రకమైన ఏకాభిప్రాయాన్ని సాధించటమయినా అసాధ్యమనే పరిస్థితి నెలకొంది. మన జాతీయోద్యమ కాల నేతలు సాధించింది ఓ అద్భుతం. వామపక్ష, మితవాద; ఉత్తర, దక్షిణ; హిందీ, హిందీయేతర; పేద, ధనిక; అగ్రకుల, నిమ్న కుల; హిందూ, ముసల్మాన్ ఇలా అందరినీ కలిపారు. ఉన్నత వర్గాల మధ్య ఏకాభిప్రాయం సాధించారు. అందరూ అంగీకరించారు. కానీ ఈవేళ్టి రాజకీయాల్లో, ఈ వేళ్టి భారతదేశంలో మీరు ఒకటి మంచి అంటే, ఇంకొకరు చెడు అంటారు. ఒకరు ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగాయి అంటే, మరొకరు హ్యాకింగ్ జరిగి ఉండొచ్చంటారు. భారతీయ సమాజం, రాజకీయం, కలిసొచ్చి ఒక ఉదాత్త, సమర్థ రాజ్యాంగాన్ని రూపొందించటం సాధ్యమయ్యే పరిస్థితేమన్నా కనిపిస్తోందా? కొత్త రాజ్యాంగం రాయటం అంటే మీరు దేశాన్ని ముక్కలు చేస్తారు. మీరు ఏమి కోరుతున్నారో ఒక్కసారి తరచి చూసుకోండి. అప్రమత్తమవ్వండి. రాజ్యాంగాన్ని ముట్టుకోవద్దు. అవసరమైన మార్పులు చేసుకోవటానికి ఎటువంటి అభ్యంతరాలు అక్కర్లేదు. జాగ్రత్తగా, లోతుగా ఆలోచించి, ఏకాభిప్రాయాన్ని సాధించి తగిన మార్పులు చేసుకోవచ్చు. ఆ పరిధిలోనే జీఎస్టీ వచ్చింది. అన్ని పార్టీలు కలిసొచ్చాయి. ఏకాభిప్రాయాన్ని నిర్మించారు. ఇంకా కొన్ని లోపాలున్నాయని విమర్శలు చేయవచ్చు. కానీ జి.యస్.టి పనిచేసింది. దేశానికి ఫలితాలు సాధిస్తోంది.

రాజ్యాంగంపై మితిమీరిన భారం పెట్టొద్దు. రాజ్యాంగంలో దుందుడుకు మార్పులు తేవాలని ఆలోచించొద్దు. రాజ్యాంగాన్ని తిరిగి రాయాలనుకోవద్దు. ఆ ప్రయత్నం చేస్తే ఈ దేశం మనుగడ సాగించలేదు. కాబట్టి విజ్ఞతని ప్రదర్శిద్దాం. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుచుకుందాం. ☆

# భారత రాజ్యాంగ రూపకర్తలు



1946 డిసెంబర్ 6న రాజ్యాంగ పరిషత్ ఆవిర్భావం జరిగింది. ఎన్నికైన ప్రముఖుల్లో జవహర్ లాల్ నెహ్రూ (భారత జాతీయ కాంగ్రెస్), బాబు జగ్జీవన్ రామ్ (కార్మిక వర్గం), మహమ్మద్ అలీ జిన్నా (ముస్లిం లీగ్) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ (షెడ్యూల్ కులాలు), శ్యాం ప్రసాద్ ముఖర్జీ, ఎంఆర్ జయకర్ (హిందూ మహాసభ) సర్వేపల్లి రాధాకృష్ణన్, సరోజినీ నాయుడు తదితరులు. ఇరు తెలుగు నేతల్లో టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, పట్టాభి సీతారామయ్య, దుర్గాబాయి దేశ్‌ముఖ్, కళా వెంకట్రావు, కల్లూరు సుబ్బారావు, మోటూరు సత్యనారాయణ, ఎన్జీరంగా, బొబ్బిలి రామకృష్ణ రంగారావు ఎన్నికయ్యారు.

– రాజ్యాంగాన్ని రూపొందించేందుకు 1947లో ముసాయిదా కమిటీ ఏర్పడింది. దీనికి అంబేద్కర్ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంట్లో ఏడుగురు సభ్యులతో కూడిన ప్రధాన కమిటీ తో పాటు కొన్ని ఉప కమిటీలు ఏర్పడ్డాయి.

– అవిభాజ్య భారత రాజ్యాంగ పరిషత్ (సభ)లో మొత్తం సభ్యుల సంఖ్య 389. ఇందులో బ్రిటిష్– ఇండియాలోని 11 గవర్నర్ పాలిత రాష్ట్రాల నుంచి 292 మంది ఎన్నికయ్యారు. చీఫ్ కమిషనర్ పాలిత ప్రాంతాల నుంచి (ఢిల్లీ, అజ్మీర్– మేవార్, కూర్గ్ బ్రిటిష్ బలుచిస్తాన్) నుంచి నలుగురు సభ్యులు, స్వదేశీ సంస్థానాల నుంచి 93 మంది నియమితులయ్యారు. తర్వాత ముస్లిం లీగ్ సభ నుంచి వైదొలగడంతో రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కి తగ్గింది. ఇందులో బ్రిటిష్ ఇండియా పాలిత ప్రాంతాలకు 229, స్వదేశీ సంస్థానాలకు 70 మంది ప్రాతినిధ్యం వహించారు. 15 మంది మహిళలు రాజ్యాంగ సభలో తమ వాదన వినిపించారు.

## గాంధీ పేరు పై పట్టు

జాతిపిత మహాత్మాగాంధీ పేరు రాజ్యాంగ ప్రవేశికలో ఉండాలన్న చర్చ జరిగింది. ఇందుకు సంబంధించిన సవరణను షిబ్బన్‌లాల్ సక్సేనా ప్రవేశపెట్టారు. సత్యం, అహింసలే ఆయుధాలుగా బానిసత్వం నుంచి మహాత్ముడు దేశానికి స్వేచ్ఛ ప్రసాదించారని, అటువంటి వ్యక్తి పేరు తప్పనిసరిగా ఉండాలని సక్సేనా తన తీర్మానంలో కోరారు.

యునైటెడ్ ప్రావిన్సెస్ సభ్యుడు ఆచార్య జె.బి. కృపాలని ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. "ఈ సవరణపై ఓటింగ్ జరపకూడదు. జాతిపిత గాంధీ పేరును ప్రస్తావించేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. గాంధీ పై నాకు అపార ప్రేమ, గౌరవం ఉన్నాయి. ఈ విషయం నా స్నేహితుడు షిబ్బన్ లాల్ కు తెలుసు ఆ గౌరవంతోనే గాంధీ ప్రస్తావన తేవద్దని ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నా" అని కృపలాని కోరారు. దీంతో శుభంలాల్ తన సవరణను ఉపసంహరించుకున్నారు.

## అతి పురాతనం సాన్ మారినో.. అతిపెద్దది మనదే

ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన రాజ్యాంగం కలిగిన దేశంగా ఐరోపాలోని సాన్ మారినో చరిత్రకెక్కింది. 1600 అక్టోబర్ 8న రూపుదిద్దుకున్న ఈ రాజ్యాంగం ఇప్పటికి అమల్లో ఉంది. 2002లో చివరిసారిగా దీన్ని సవరించారు. అగ్రరాజ్యమైన అమెరికా రాజ్యాంగం (1788 జూన్ 21న) ఈ వరుసలో రెండవ స్థానంలో నిలిచింది. రిపబ్లిక్ ఆఫ్ పోలాండ్ (1791 మే 3), నార్వే (1814 మే 17), నెదర్లాండ్స్ (18 15), బెల్జియం (1831 ఫిబ్రవరి 7), లగ్జెంబర్గ్(1841 అక్టోబర్ 2) స్విట్జర్లాండ్ (1848 సెప్టెంబర్ 12) డెన్మార్క్ (1849 జూన్ 5) కెనడా (1867 జూలై 1) తర్వాత స్థానాల్లో నిలిచాయి.

ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాలు కలిగిన దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఇది 1,46,385 పదాలు కలిగి ఉంది. తర్వాత స్థానాల్లో నైజీరియా(66263), బ్రెజిల్(64,448), మలేషియా(64,080), పపువా న్యూగినియా(58,490) నిలిచాయి.

# తెర వెనుక నిపుణుడు



భారత రాజ్యాంగ రచనలు అత్యంత కీలక పాత్ర పోషించి..అంతగా ప్రచారంలోకి రాకుండా తెరవెనుక ఉండిపోయిన నిపుణుడు సర్ బెనగళ్ నర్సింగరావు. కర్ణాటకలోని మంగళూరులో 1887 ఫిబ్రవరి 26న జన్మించిన నరసింగరావు బ్రిటిష్ ప్రభుత్వంలో ఇండియన్ సివిల్ సర్వీస్ (ఐసీఎస్) అధికారిగా పనిచేశారు. క్రమంగా న్యాయమూర్తిగా మారిన నర్సింగరావుకు వివిధ దేశాల రాజ్యాంగాలపై గట్టి పట్టు ఉండేది. దీంతో భారత చరిత్రలో అత్యంత కీలకమైన 1935 భారత ప్రభుత్వ పరిపాలన చట్టాన్ని రూపొందించడంలో ఆయన సేవలను వినియోగించుకుంది ఆంగ్లేయ సర్కారు. 1944లో ఐసిస్ నుంచి రిటైర్ అయిన నర్సింగరావు ను భారత వైస్రాయ్ గవర్నర్ జనరల్ కార్యాలయంలో రాజ్యాంగ సంస్కరణల కార్యదర్శిగా నియమించుకున్నారు.

భారత స్వాతంత్ర్యం దిశగా అడుగులు పడడంతో బి.ఎన్.రావు పాత్ర అత్యంత కీలకమైంది. అటు ఆంగ్లేయులకు, ఇటు భారతీయులకు మధ్య ఆయన అనుసంధానకర్తగా మారారు. 1946 డిసెంబర్ 9న తొలిసారిగా రాజ్యాంగ సభ సమావేశం కాగా.. జూలైలోనే నర్సింగరావు సభకు సలహాదారుగా నియమితులయ్యారు. రాజ్యాంగ రచన కమిటీలోను సభ్యులయ్యారు. రాజ్యాంగ సభ ఎలా పని చేయాలో ఏ ఏ కమిటీలు ఉండాలో, వాటి పని తీరు, బాధ్యతలను నిర్దేశించడంతో పాటు, ముందస్తుగానే ముసాయిదా రాజ్యాంగ ప్రతిని సిద్ధం చేసి అంబేద్కర్ సారధ్యంలోని కమిటీ ముందు ఉంచారు. బర్మా (ప్రస్తుత మయన్మార్) సైతం తమ రాజ్యాంగ రచనలో నర్సింగరావు సాయం తీసుకుంది. ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం భారత్‌ది. మరి అంత పెద్ద రాజ్యాంగాన్ని రాయటానికి పట్టిన సమయం మూడేళ్ల కంటే తక్కువే. ఇంత తక్కువ సమయంలో ఆంగ్లేయులే కాకుండా యావత్ ప్రపంచం ఆశ్చర్యపోయేలా రాజ్యాంగ రచన పూర్తవడం వెనుక నర్సింగరావు కృషితో పాటు నైపుణ్యం దాగుంది. అంబేద్కరే స్వయంగా ఆయనను కొనియాడారు. హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా నియమితులై ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం కోసం నిలబడ్డ ఈ భారత ప్రతిభా మూర్తి 1953 నవంబర్ 30న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ ఆసుపత్రిలో మరణించారు.



## రాజ్యాంగం ఆమోదం, అమలు

**1949 నవంబర్ 26న రాజ్యాంగ మూడో పఠనం ముగించి ఆమోదం తెలిపారు. 1950 జనవరి 24న రాజ్యాంగ చివరి సంస్కరణ పై అసెంబ్లీ సభ్యులు సంతకం చేశారు. 1950 జనవరి 26 నుంచి ఇది అమలులోకి వచ్చింది.**

## కాలానుగుణ మార్పులకు అవకాశం

మేం రాసిందే శాసనం, మేం చెప్పిందే పాటించాలి అని మన రాజ్యాంగ నిర్మాతలు భావించలేదు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పులు చేర్పులు జరగాలని అభిలషించారు. రాజ్యాంగాన్ని సవరించే అత్యున్నత అధికారం పార్లమెంట్‌కి ఇచ్చారు. పార్లమెంట్ ఇప్పటివరకు 106 సార్లు రాజ్యాంగ సవరణ చేసింది. రాజ్యాంగంలో 1949లో 22 అధ్యాయాలు, 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉండగా, 2024లో అవి 25-448-12 గా ఉన్నాయి.

# ప్రపంచ రాజ్యాంగాల్లోని మంచినంతా స్వీకరించి

మన దేశం లాగే వలస పాలనలో మగ్గి స్వాతంత్రం పొంది ప్రజాస్వామ్య బాట పట్టిన అనేక దేశాలు కాలక్రమంలో నిర్వీర్యమయ్యాయి. నియంతృత్వంలోకో, సైనిక పాలనలోకో జారి పోయాయి. ప్రపంచంలో ఎక్కడా లేనన్ని భాషలు, సంప్రదాయాలు, భిన్న మతాలు వేల కులాలు ఉన్నాయి.. దేశ విభజన, అల్లకల్లోల పరిస్థితులు, ఆర్థికంగా తప్పటడుగులతో పేదరికం, చైనా , పాకిస్థాన్‌లతో ప్రత్యక్ష పరోక్ష యుద్ధాలు, ఎమర్జెన్సీ లాంటి దిగజారుడులు, ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్, కాశ్మీర్‌లలో రాజకీయ తప్పిదాల వల్ల పెచ్చరిల్లిన ఉగ్రవాదం వంటి సవాళ్లు ఎదురైనా ఎంతోమంది అంచనాలను తారుమారు చేస్తూ భారతావనిలో ప్రజాస్వామ్యం నిలబడడమే కాదు బలపడిందంటే అందుకు మన రాజ్యాంగం ఓ పెద్ద కారణం. జాతిగా నిలిపి, దేశంగా కలిపి ఉంచుతున్న చిత్రం, రక్షాబంధం మన రాజ్యాంగం.

మంచి ఎక్కడ ఉన్నా స్వీకరించమన్నారు పెద్దలు. భారత రాజ్యాంగ నిర్మాతలు ఆ పని చేశారు. భారత రాజ్యాంగ తయారీ సమయంలో ప్రపంచంలోని రాజ్యాంగాలన్నింటినీ తిరగేశారు. వాటిలోంచి మనకు ఉపయోగపడే భావనలను తీసుకున్నారు. ఇలా మన సొంత ఆలోచనలకు ప్రపంచంలోనే అత్యుత్తమ అంశాలను కలిపి మన రాజ్యాంగంలో పొందుపరిచారు. ఏ దేశం నుంచి ఏం ఏర్చి కూర్చారంటే..

**అమెరికా:** రాజ్యాంగ ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, సమాఖ్య ప్రభుత్వం, ఎలక్టోరల్ కాలేజ్, స్వతంత్ర న్యాయవ్యవస్థ, శాసన, కార్య, న్యాయ వ్యవస్థల మధ్య అధికారాల సమతుల్యత, న్యాయ సమీక్ష.

**బ్రిటన్:** పార్లమెంటరీ తరహా ప్రభుత్వం, మంత్రి మండలి వ్యవస్థ, చట్టబద్ధ పాలన, సమానత్వ హక్కు, ఏక పౌరసత్వం, సుప్రీంకోర్టు, హైకోర్టులకు రిట్స్ జారీ చేసే అధికారం, ద్వి సభల విధానం, స్పీకర్ వ్యవస్థ చట్టాల రూపకల్పన ప్రక్రియ.

**కెనడా:** శక్తివంతమైన యూనియన్ ప్రభుత్వం, సమాఖ్య వ్యవస్థ, జాతీయస్థాయి రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణి, యూనియన్‌కి అవశిష్ట(రెసిడ్యూయరీ) అధికారాలు, గవర్నర్ల నియామకం, సుప్రీంకోర్టు పరిధి.

**ఐర్లాండ్:** ఆదేశిక సూత్రాలు, రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ, రాజ్యసభకు సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేసే విధానం.

**ఫ్రాన్స్:** గణతంత్ర, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ భావనలు.

**యుఎస్ఎస్ఆర్(సోవియట్ యూనియన్):** ప్రాథమిక విధులు, ప్రవేశికలోని సామ్యవాద, ఆర్థిక ,రాజకీయ, న్యాయభావనలు,

**జర్మనీ :** అత్యయిక పరిస్థితుల్లో ప్రాథమిక హక్కుల రద్దు, ఆ సమయంలో యూనియన్‌కి అదనపు అధికారాలు.

**దక్షిణాఫ్రికా:** రాజ్యసభ సభ్యుల ఎన్నిక, రాజ్యాంగ సవరణలు

**జపాన్ :** న్యాయ సూత్రాలు



☞ భారత రాజ్యాంగాన్ని ఇతర రాజ్యాంగాల నుంచి కొల్లగొట్టి రూపొందించిందని ఎవరైనా వర్ణిస్తే .. గర్వపడతాను. మంచి ఎక్కడున్నా స్వీకరించడంలో తప్పులేదు.

☞ గొప్ప వ్యక్తికి ప్రముఖ వ్యక్తికి మధ్య చాలా తేడా ఉంది. గొప్ప వ్యక్తి ఎప్పుడూ సమాజ సేవకే ప్రాధాన్యమిస్తాడు. ప్రముఖ వ్యక్తి తన గురించి మాత్రమే ఆలోచిస్తాడు.

☞ దేశానికి గాని, జాతికి గానీ, సంఖ్యాబలం ఒక్కటే సరిపోదు. ప్రజలు విద్యావంతులై ఆత్మగౌరవంతో, విశ్వాసంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.

☞ రాజకీయ పార్టీల కన్నా దేశం మిన్న. లేకుంటే మనం మళ్ళీ స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. అలా జరగనీయద్దు.

☞ దేశానికి జీవితాంతం సేవలందించిన గొప్ప వ్యక్తులకు కృతజ్ఞతలు చూపండి. తప్పులేదు. కానీ అభిమానానికి హద్దులు ఉంటాయని గుర్తించండి. వ్యక్తి ఆరాధన విషయంలో అప్రమత్తంగా ఉండండి. మతంలో మోక్ష సాధనకు భక్తి ఓ సాధనం కావచ్చు, కానీ రాజకీయాల్లో అదే భక్తి ..పతనానికి, అంతిమంగా నియంతృత్వానికి దారితీస్తుందని గుర్తుపెట్టుకోండి.

☞ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను కలిపి చూడండి. వీటిని విడదీస్తే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం. సమానత్వం నుంచి స్వేచ్ఛను విడదీయలేం. అలాగే స్వేచ్ఛ నుంచి సమానత్వం కూడా. ఇవి విడివిడిగా ఉంటే అందరిపై కొందరు ఆధిపత్యం చెలాయిస్తారు.

☞ స్వాతంత్ర్యం మనపై పెద్ద బాధ్యతను పెట్టిందనే విషయాన్ని మర్చిపోవద్దు. ఏ తప్పు జరిగిన ఇక బ్రిటిష్ వాళ్ళను విమర్శించలేం మనమే బాధ్యత వహించాలి.

–డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

# రాజ్యాంగంపై చర్చ.. రాజకీయ రచ్చ

ఏదైనా ఒక అవసరమైన చట్టం ఆమోదం పొందిన సందర్భం గుర్తుంచుకోదగ్గదే గానీ, నిజంగా ప్రస్తావించుకోవాల్సింది అది అమలవుతున్న క్రమం. ఈ నేపథ్యంలో రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2024 డిసెంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఉభయ సభల్లో నాలుగు రోజులు పాటు చర్చలు జరుగుతాయంటే పలువురు ఆసక్తిగా ఎదురు చూశారు. స్వతంత్రం వచ్చి 50 ఏళ్లు, 60 ఏళ్లు పూర్తయిన సందర్భాల్లో పార్లమెంటులో జరిగిన చర్చలు గుర్తున్న వాళ్లయితే మళ్లీ ఆ స్థాయిలోనైనా జరుగుతాయని ఆశపడ్డారు. కనీసం ఒక దిశానిర్దేశం వెలువడుతుందని ఎదురు చూశారు. రాజ్యాంగం రాజకీయాలకు అతీతం కానప్పటికీ, ఆ రాజకీయాలకు సూత్రబద్ధత, వాటి ద్వారా సంపాదించే అధికారానికి లక్ష్యం ఉండాలన్న మౌలిక సూత్రాలను విస్మరించి పార్టీ రాజకీయాల చుట్టూ పరస్పర ఆరోపణల చర్చ చేశారు. రాజ్యాంగ సవరణలు, రిజర్వేషన్లు, ఎమర్జెన్సీ, ఎన్నికల నిర్వహణ, ఇలా ప్రస్తావించిన ప్రతి అంశంపై సంకుచిత వాదనలు వినిపించారు. అది ముగిశాక ఇంకా ఘోరంగా ప్రవర్తించారు. ఇప్పటివరకు అసెంబ్లీలకే పరిమితమైన భౌతిక హింస పార్లమెంట్ లోను కనిపించింది. మళ్ళీ అది కూడా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చుట్టూ. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో పెద్ద దుమారమే రేగింది.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల ఉత్పాదకత ఎలాగూ తక్కువగానే ఉంది. అయితే రాజ్యాంగ దినోత్సవ సమయంలో దిగ్భ్రాంతికర రీతిలో సభ్యులు ప్రవర్తించడం ప్రజాస్వామ్యవాదులను నిరుత్సాహానికి గురిచేసింది. నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందడానికి ముందు రోజు పార్లమెంటులో అంబేద్కర్ ప్రసంగిస్తూ చెప్పిన రెండు విషయాలను ఇక్కడ ప్రస్తావించుకోవాలి. “లక్ష్యాల సాధన కోసం ఆందోళనలకు రాజ్యాంగబద్ధ పద్ధతులనే అనుసరించండి. వలస కాలం నాటి రాస్తారోకోలు, సార్వత్రిక బంద్‌లు వంటి పద్ధతులను విడనాడండి. పౌర హక్కుల ఉల్లంఘనల వంటి వాటిని ఎంత త్వరగా త్యజిస్తే అంత మంచిది.”

“ దేశానికి గొప్ప సేవలు అందించిన వ్యక్తుల పట్ల కృతజ్ఞత చూపండి. కానీ రాజకీయాల్లో భక్తి వ్యక్తి ఆరాధన ప్రమాదకరం.”

ఈ మాటలకు పూర్తి విరుద్ధంగా పార్లమెంటులో రెండు ప్రధాన జాతీయ పార్టీల సభ్యులు వ్యవహరించారు.

**అదానీపై అసలు విషయంలో మాట్లాడలేదు**

ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ అమెరికా బ్యాంకుల నుంచి తీసుకున్న నిధులతో భారత్ లోని కొందరు రాజకీయ నేతలకు ముడుపులు ఇచ్చారని ఆ దేశంలో అభియోగం దాఖలైన నేపథ్యంలో.. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొందరు మంత్రివర్గ సహచరులతో కలిసి పాల్గొన్నారు. వారి రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గతంలో కాంగ్రెస్ నేత రోశయ్య ముఖ్యమంత్రి హోదాలో ఇలాగే ఒక ఆందోళనలో పాల్గొని రోడ్డుపై బైఠాయించినప్పుడు ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. శాంతి భద్రతలకు, సాధారణ పౌర జీవితానికి అంతరాయం కలుగుతుంది అనుకున్నప్పుడు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ ముఖ్యమంత్రిని అరెస్టు చేయవచ్చని స్పష్టం చేశారు. నిరసన వ్యక్తం చేయడానికి, తమ వాదనలు హేతుబద్ధంగా వినిపించుకోవడానికి, ఆరోపణలు నిజమైతే నిరూపించడానికి చట్టసభ సహా పలు ప్రజాస్వామిక పద్ధతుల్ని రాజ్యాంగ అందించినా, సాక్షాత్తు చట్టసభ సభ్యులు రాజ్యాంగ పదవిలో ఉన్నవాళ్లు 75 వ రాజ్యాంగ దినోత్సవ సమయంలో ఇలాంటి రాజ్యాంగ విలువలు, చట్టబద్ధ పాలనను కాలరాసే పద్ధతిలో వ్యవహరించడం తీవ్ర ఆక్షేపణీయం.

తీరా అదానీ ముడుపుల ఆరోపణలకు మూల కారణమైన ఎన్నికల అక్రమ వ్యయం గురించి ఎవరైనా మాట్లాడారా అంటే అదేమీ లేదు. ఆ విషయంపై మాత్రం మౌనం వహిస్తున్నారు. ఒక తెలుగు రాష్ట్రంలో ఎవరికైతే అదానీ ముడుపులు ఇచ్చారని చెబుతున్నారో ఆయన ప్రత్యర్థి పార్టీ వాళ్లు కూడా తేలు కుట్టిన దొంగల్లా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. జమిలి ఎన్నికలకు అనుకూలమా, ప్రతికూలమా అని తప్ప అదానీ లంచాలు లాంటి ఆరోపణలు మళ్ళీ రాకుండా నిజమైన ఎన్నికల సంస్కరణ కోసం మాత్రం ఏ ప్రధాన పార్టీ మాట్లాడలేదు. ఫలితంగా విలువైన పార్లమెంట్ సమయాన్ని, రాజ్యాంగంపై ఒక చారిత్రక సందర్భంలో లోతైన సమీక్షతో లోపాల్ని సరిదిద్దుకొని జాతికి దిశా నిర్దేశం చేసే గొప్ప అవకాశాన్ని పార్టీలు జారవిడిచాయి. ✰

# ఎమర్జెన్సీ: దక్షిణ కొరియా- ఇండియా

ప్రపంచ పరిణామాలు మనదేశంలో నిత్య జీవితంపై ప్రభావం చూపటం ఆర్థిక రంగంలో దశాబ్దాల క్రితమే మొదలైంది. ఇటీవల కాలంలో యుద్ధాలు, వివిధ దేశాల ఎన్నికల్లో ఓటింగ్ తీరు, ప్రభుత్వాల అస్థిరత, విదేశీ సంబంధాలు వంటి అంశాలు కూడా చర్చాంశాలవడం మన వద్ద పెరిగింది. అటువంటి ఒక పరిణామం డిసెంబర్ 3న దక్షిణ కొరియాలో ఎమర్జెన్సీ, సైనిక పాలన విదింపు.

మనకు స్వతంత్రం వచ్చిన సుమారు దశాబ్దం నర వరకు మనకంటే వెనుకబడి ఉన్నా, ఆ తర్వాత ఆర్థికంగా, మానవ వనరుల అభివృద్ధి పరంగా సరైన వ్యవస్థల నిర్మాణంతో వేగంగా ఎదిగిన ప్రజాస్వామ్య దేశంగా దక్షిణ కొరియా గుర్తింపు పొందింది. అక్కడి సేవలు, సాంకేతిక ఉత్పత్తులు క్రమంగా మనకు చిరపరిచితమయ్యాయి. అలాంటి దక్షిణ కొరియా 2024 ముగింపు సమయంలో దేశాధ్యక్షుడు యూన్ సుక్ యొల్ ఎమర్జెన్సీ మార్షల్ లా విధించడంతో హఠాత్తుగా వార్తల్లోకి వచ్చింది.

ఏం జరుగుతుందోనన్న ఆసక్తిని ప్రదర్శిస్తుండగానే 6 గంటల వ్యవధిలోనే ఎమర్జెన్సీని అధ్యక్షుడు వెనక్కి తీసుకున్నారు. ఆ దేశ ప్రజలు వెనువెంటనే రోడ్ల మీదకు వచ్చి తిరుగుబాటు ప్రదర్శనలు చేయడం ఇందుకు కారణం. ప్రజల నాడి గమనించిన సైన్యం వెనక్కి తగ్గింది. కొన్నిచోట్ల తమ తుపాకుల్ని ప్రజలు లాక్కుంటున్నా సైనికులు చేష్టలుడిగారు. పార్లమెంటు సభ్యులైతే గేట్లు మూసేసినా గోడదూకి లోపలికి ప్రవేశించటానికి పోటీపడ్డారు. ప్రతిపక్ష, అధికారపక్షం తేడా లేకుండా అధ్యక్షుడి ఎమర్జెన్సీ ప్రకటనను విమర్శించారు. అధ్యక్షుడు తన ప్రకటనను ఉపసంహరించుకోవడంతో సైనిక దళాలు వెనక్కి మళ్లాయి. ఎంపీలు అధ్యక్షుడి మీద అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. అధికారపక్షం నుంచి కూడా ఆయన్ని గద్దిదించాలని డిమాండ్ వచ్చింది.

పార్లమెంటులో అభిశంసన తీర్మానం రాకముందే అధ్యక్షుడు ఓ టీవీ ఛానల్ ద్వారా ప్రజలకు క్షమాపణ చెప్పారు.'సైనిక పాలన విధించటం కారణంగా ప్రజలను ఆందోళనకు, అసౌకర్యానికి గురి చేసినందుకు క్షమాపణ



తెలియజేస్తున్నాను. ఇంకోసారి ఎమర్జెన్సీ విధించే ప్రయత్నం చేయనని హామీ ఇస్తున్నాను' అని తెలియజేశారు. చివరికి 204 –85 ఓట్లతో అభిశంసన తీర్మానం నెగ్గింది.

దాయాది దేశం ఉత్తరకొరియా చెత్త బెలూన్లు వదలడం వంటి చిల్లర చేష్టలకు పాల్పడడం, మిస్సైల్ దాడులు చేస్తుండడం, అణుబాంబు బెదిరింపులకు దిగడం వంటి చర్యలతో తమకు చికాకు కలిగిస్తున్నా..ఉత్తరకొరియా కమ్యూనిస్టు నియంతృత్వ నాయకత్వంతో కుమ్మక్కైన ప్రతిపక్షాల బారి నుంచి దక్షిణ కొరియా రిపబ్లిక్‌ను కాపాడేందుకే మార్షల్ లా విదిస్తున్నాననే వాదనను ప్రజాభిప్రాయం తిరస్కరిస్తుందని గుర్తించక పోవడానికి యొల్ యాదృచ్ఛికంగా అధ్యక్ష పదవికి ఎన్నిక కావటం, కొన్ని ఆరోపణలు కారణమని ఈ అంశంపై 'జేపీ లోక్‌సత్తా' యూట్యూబ్ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ వ్యాఖ్యానించారు.

భారతదేశంలో 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ వల్ల తన జీవితాన్ని మార్చుకున్న వ్యక్తి జేపీ. ఎంబీబీఎస్ చదివినా, కేవలం దేశానికి ఎక్కువ ఉపయోగపడగలనన్న ఉద్దేశంతో ఐఏఎస్‌కి పోటీపడి తొలి ప్రయత్నంలోనే టాపర్స్‌లో ఒకరిగా విజయం సాధించిన జేపీపై ఎమర్జెన్సీ నేపథ్యంలో కొంతకాలం నిఘా కూడా కొనసాగింది. లోక్‌సత్తా జేపీపై ఎమర్జెన్సీ ప్రభుత్వం గురించి అప్పట్లో గుంటూరు మెడికల్ కాలేజీలో ఆయనకు రెండేళ్లు జూనియర్‌గా ఉండి, ఆ తర్వాత కర్నూల్ మెడికల్ కళాశాలలో న్యూరాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా రిటైరైన వైద్యులొకరు ఇటీవల చెబుతూ.. ఆసుపత్రి వార్డుల పర్యవేక్షణ పూర్తవగానే విభాగాధిపతి (వాసుదేవరావు గారు

అని చెప్పినట్లు గుర్తు) గదిలో జేపీ, మరికొందరు మెడికోలు కూర్చుని దేశ రాజకీయ సంక్షోభం గురించి గంటల తరబడి చర్చోపచర్చల్లో మునిగి తేలుతుండేవారని తెలిపారు.

అప్పట్లో ఎమర్జెన్సీ వల్ల భారత్లో కొన్ని లక్షల మంది ప్రభావితులయ్యారు. సుప్రీంకోర్టు సహా కోర్టుల తీర్పులు, ఆదేశాలు కూడా ఎమర్జెన్సీ ప్రభావానికి లోనయ్యాయి. ఆ తరాన్ని చూసిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, రాజకీయ కారణాల రీత్యా కూడా అయ్యుండొచ్చు , ఎమర్జెన్సీ విధించిన రోజును 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటించింది. ఎమర్జెన్సీ వల్ల గుణాత్మ మార్పుకు లోనై వివిధ రంగాల్లో జీవన పంథాన్ని ఎంచుకున్న వారిలో రాజకీయ భావజాలపరంగా, మార్పు పరంగా బహుశా అతి ఎక్కువ ప్రభావం చూపింది, 50 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ప్రభావం చూపుతున్నదీ లోక్‌సత్తా జేపీయేనేమో. ఎమర్జెన్సీ పై పోరాటం ఎందుకు విఫలమైందీ వివరిస్తూ, దేశంలో ఎలాంటి మార్పులు వస్తే జాతీయోద్యమ, ఎమర్జెన్సీ యోధులు కలలుగన్న నిజమైన ప్రజాస్వామ్యం సాకారం అవుతుందో సహేతుకంగా, ఆచరణ సాధ్యంగా తెలియజేయటం కోసం తన యవ్వన కాలాన్ని ధారబోయడంతో పాటు, ప్రజల్ని భాగస్వామ్యం చేయడం కోసం తెలుగు రాష్ట్రాలు కార్యక్షేత్రంగా వేదికల్ని నిర్మించారు. వయసు ప్రయాసని కూడా లెక్కచేయకుండా వచ్చే తరాల కోసం ఆ వేదికల ద్వారా వ్యక్తిగతంగా ఇప్పటికీ దేశవ్యాప్త కృషి చేస్తున్నారు. ప్రవాస భారతీయుల్నీ ప్రభావితం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జేపీ నిర్మించిన ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఉద్యమం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏ దేశంలోనూ జరగనంత విస్తృత పౌర సమాజ రాజకీయ కృషిని నిర్వర్తిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారు, ప్రభుత్వాల్ని నడుపుతున్న వారి కంటే సీరియస్ రాజకీయ కృషితో నెమ్మదిగా నిశ్శబ్దంగా అయినా మౌలిక విజయాన్ని సాధిస్తున్నాయి. ఈ మొత్తానికీ తనకు ప్రేరణనిచ్చిన ఎమర్జెన్సీని దక్షిణ కొరియాలో విధించటంపై మాట్లాడే టప్పుడు జేపీకి ఒక ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారత్‌లో ఇప్పుడు ఎమర్జెన్సీని విధిస్తే 1975 లోలా ప్రజలు సహిస్తారా? దీనిపై జేపీ వ్యాఖ్యానిస్తూ, అప్పట్లో రాత్రికి రాత్రి ఎమర్జెన్సీ విధించిన ప్రధాని ఇందిరాగాంధీ ఆ తర్వాత ఏ కారణం చేతో గెలుస్తామన్న ధీమాతో ఎన్నికలు నిర్వహిం చారని, ఆమె గనక ఎమర్జెన్సీని కొనసాగించి ఉంటే దేశ గతి ఎలా ఉండేదో చెప్పడం కష్టమని అన్నారు. ఒకవేళ ఆమె ఎమర్జెన్సీ కొనసాగించి ఉంటే దేశంలో పలు ప్రాంతాల్లో ప్రజలు తిరగబడేవారా అన్నది సందేహాస్పదమన్నారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియా కారణంగా పరిస్థితి వేరుగా ఉండొచ్చని జేపీ అభిప్రాయపడ్డారు.

**పోల్‌లో 74 శాతం మంది అభిప్రాయం**

ఈ ప్రశ్న మీదే 'జేపీ లోక్‌సత్తా' యూట్యూబ్ కమ్యూనిటీ విభాగంలో పోల్ పెడితే, దక్షిణ కొరియన్లలా ఈవేళ్టి భారతీయులు తిరగబడతారు అని 74 శాతం మంది అభిప్రాయపడ్డారు. కానీ ఆ పోల్‌లో వచ్చిన కామెంట్లలో ఒకటి ఆసక్తికరంగా, ఎక్కువ వాస్తవికంగా అనిపించింది .'భారతీయులు ఈవేళ తిరగబడతారు గానీ, సోషల్ మీడియాలోనే' అని ఆ కామెంటర్ అన్నారు. సోషల్ మీడియాలో ప్రజలు తిరగబడటం మన దేశంలో రోడ్లమీద ఉద్యమాలకి, రాజకీయ, విధానపరమైన మార్పులకి దారి తీయలేదని కాదు. వాటి ఫలితాలేమిటన్నది అలా ఉంచితే, నిర్భయ ఉదంతం, కొంతవరకు 2జీ స్పెక్ట్రమ్ అవినీతి కేసు నేపథ్యంలో అన్నా హజారే నేతృత్వంలో సాగిన లోక్‌పాల్ ఉద్యమం ఈ కోవలోనివే. కానీ ఎమర్జెన్సీ విధిస్తే దాని రద్దు చేసే స్థాయిలో భారతీయులు సోషల్ మీడియా దాటి ఉద్యమం చేస్తారా అన్నది కొంత వరకు ప్రశ్నార్థకమే. 1975లో భారత్‌లో ఎమర్జెన్సీ సుమారు 21 నెలల పాటు కొనసాగితే, దక్షిణ కొరియాలో కేవలం 6 గంటల్లో ఎత్తేశారు. అయినా కూడా అధ్యక్షుడు మొండిగా ఎమర్జెన్సీని కొనసాగిస్తే ఏం జరిగేదో ఊహించటం కష్టం అని,అధ్యక్షుడి అభిశంసన తర్వాత జరిగిన నాటకీయ పరిణామాల నేప థ్యంలో సందేహాలు వ్యక్తం చేస్తున్నవాళ్లు కూడా ఉన్నారు. ఈ సందేహాలు అతిశయోక్తులు, అతి అనుమానాలు కావచ్చు. ఎందుకంటే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిలబడ టానికి ప్రజా స్వామిక చైతన్యాన్ని క్రియాశీలకంగా వ్యక్తం చేయటానికి కావలసిన ఆర్థిక బలమే కాదు, వ్యవస్థల బలం కూడా దక్షిణ కొరియాకు ఉంది. ఆ దేశ తలసరి ఆదాయం జీడీపీ ప్రకారం సుమారు 37,000 డాలర్లు. భారత్ కంటే దాదాపు 11 రెట్లు ఎక్కువ. అదే విధంగా మన దేశంతో పోలిస్తే సాధారణ స్థాయి అవినీతికి పాల్పడ్డ కారణంగా అక్కడ ఇద్దరు దేశాధ్యక్షులను జైల్లో పెట్టారు .అలాంటి నేరానికి పాల్పడితే ఒక కార్పొరేటర్‌ని కూడా శిక్షించలేని స్థాయిలో ఉన్న మన దేశంతో పోలిస్తే అనేక రెట్లు ప్రామాణికమైన చట్టబద్ధ పాలన పాలన ఉన్న దేశం అది. అదే విధంగా స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉంటాయి కూడా. దక్షిణ కొరియా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది. సమర్థులైన నాయకులు పార్టీల్లో వేగంగా ఎదిగే సంస్థాగత ఏర్పాటు ఉంది. అనామకులు కూడా పార్టీ అగ్ర నేతలు, నగర మేయర్లు, దేశాధ్యక్షులు అవుతుంటారు. తప్పు చేస్తే శిక్షించే సమర్థ ఏర్పాట్లు పాలన వ్యవస్థలోనే కాదు, రాజకీయ పార్టీల్లోనే ఉంది. అందువల్లనే యోల్‌ని అధికార పార్టీ వెంటనే కట్టడి చేయగలిగింది సొంత పార్టీయే అభిశంసించే పరిస్థితి ఏర్పడింది. (మిగతా 29వ పేజీలో)

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad January 2025 జుగాడ్ 50:50 రాజనీతి

## (Good Governance by Jugaad Bharat United Voters)

### ఆచరణయోగ్యమైన స్వజాతీయ నమూనా మార్పు అనే సిద్ధాంతం ఓటర్ల జాతికి అంకితం

జనవరి 25 National Voters Day సందర్భంగా ఓటర్లే ప్రభువులు అనే నినాదానికి స్ఫూర్తిగా గ్రామ స్వరాజ్యం ద్వారా సుపరిపాలన కోరుకునే ఓటర్లందరికీ భారత జాతీయ జుగాడ్ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు! రాజకీయమంటే పవిత్రమైన (అవినీతిలేని) (సేవా) వ్యాసంగం అని నిర్వచించింది FDR సంస్థ. రాజకీయమంటే లాభాపేక్షలేని (NO-PROFIT) స్వచ్ఛంద సేవారంగం (SERVICE-FIELD) అంటుంది జుగాడ్ ఓటర్ల 50:50 రాజనీతి! బంగారు భారతదేశం కోసం మనకి మనమే అధికారాన్ని కైవసం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. దానికే ఈ స్వజాతీయ నమూనా మార్పు అనే విలువలతో కూడిన సిద్ధాంతం(Doctrine). నేరచరితలేని, గుర్తింపు కలిగిన ఓటర్లు స్వచ్ఛందంగా తమ జీవితంలో ఒకేసారి సమాజ హితం కోసం, 2000 రూపాయలు, లేదా ఐదు వేలు , లేదా పదివేల రూపాయలు విరాళం ఇవ్వగలిగిన దాతలంతా జుగాడ్ ఓటర్లే!

నేడు ఏదైనా సమస్య పరిష్కారానికి కొట్లాడి సాధిద్దాం అనే ద్వేషభావపూరిత, అశాంతి ధోరణి నానాటికీ పెరుగుతోంది. ఓటర్లలో కొందరైనా స్నేహభావంతో మాట్లాడి సుపరిపాలన సాధిద్దాం అనే ధోరణి కరువైపోతోంది. రాష్ట్ర శాసనసభలలోను, కేంద్ర పార్లమెంట్లోనూ మనచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల ప్రవర్తనే అందుకు సాక్ష్యం. ఇక ప్రసార మాధ్యమాలలో, ప్రముఖ సామాజిక-విశ్లేషకుల ద్వారా డబ్బిచ్చి డబ్బా కొట్టించుకుంటున్న లీడర్లు కోకొల్లలు! ఓటు బ్యాంకు రాజకీయానికై తను ఆనాడు సెక్యులరిజం అనే పద ప్రయోగంతో రాజ్యాంగాన్ని సవరించిన పార్టీ నేడు I.N.D.I.A కూటమి ద్వారా, “సంవిధాన్ బచావో” అంటున్నది. భారతరత్న అంబేద్కర్ విరచిత రాజ్యాంగాన్ని స్వార్థ, కుటుంబ ప్రయోజనాలకోసం వాడుకోకూడదని NDA కూటమి అంటున్నది. ఓటర్లకి రాజ్యాంగం ఒక “సుపరిపాలనావిధానం”. అందులో ధర్మశాస్త్రం ఉంది, నీతిశాస్త్రం ఉంది, ఆత్మరక్షణ శాస్త్రం ఉంది, ఆర్థికశాస్త్రం ఉంది, పౌరశాస్త్రం ఉంది, భిన్నత్వంలో ఏకత్వం ఉంది. మనమంతా భారతీయులమే. మనది ఏకైక ఓటర్ల జాతి ! వోటు మనది. పార్టీ మనది. డబ్బు మనది. అధికారం మనది. 25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ “ప్రతిపాదిత జుగాడ్ ద్విపక్ష పార్టీ ఓటర్లు”గా ఇదే మా ఆహ్వానం! Cooperation based on trust (నమ్మకంపైఆధారపడిన పరస్పర సహకారం) అనే ధ్యేయంతో సంఘటితంగా మీ పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రయత్నం చేద్దాం రండి

జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు : (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)**

జుగాడ్ ఓటర్లు : **Sarvasri (11) JVL. NARAYANA (Nellore AP) (12) S.D.BABU (Tamilnadu) (13) T.SURYANARAYANA (Vizag AP) (14)Smt.D. SUBHADRA (15) M.RANGA RAO (16) M.SAI SUBBARAO (17) Smt.D.JANAKI (18) J.VENKATA RAO (Vijayawada AP) (19) P.NARASIMHA RAO (20) SAI SURYANARAYANA (Karnataka) (21) MSS KUMAR (22) Dr.U.V.KRISHNA MURTHY (23) M.RAMA RAO (24) NANDAN SRIDHAR (25) Smt.K.RAJESWARI (26) Smt.K.LAKSHMI (27) Justice CHANDRAKUMAR (28) K. VASUDEVA RAO (29) NARAGONI (30) D.KONDALA RAO (31) M.S. Narayana Rao (32) Sriram (Amalapuram AP) (33) P.Sunil (Bhimavaram AP) (34) Amaranath (35) B.Poorna Kumar Das 36) KHS Sarma 37) Metta Ramarao (Vizag, AP) 38) IR Rao 39) S Madhavarao 40) DRK Rao 41) Smt.P Amulya 42) pallela Devaraju 43) YSN MURTY (Kakinada, AP)**

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

advt

# యువ భారత్ సాధికారత



భవిష్యత్తు అత్యంత ఆశావాహంగా ఉన్న దేశాల్లో భారత్ ఈవేళ అగ్రస్థానంలో ఉంది. సాంకేతికత, అత్యధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా దన్నుగా వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ ఇందుకు ప్రధాన కారణం. అయితే భవిష్యత్తు భారతానికి ఇదో అవకాశం తప్ప ఇప్పటికీ హక్కేమీ కాదు. ఊరిస్తున్న అభివృద్ధి అవకాశం గ్యారెంటీ అయి, సుస్థిరం కావాలంటే, యువ జనాభా సానుకూలతను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. లేకుంటే ఇదే సానుకూలత ప్రతికూలతగా, అస్థిరతకు కారణంగా మారే ప్రమాదం ఉంది. ఇదేమీ కొత్తగా వెల్లడవుతున్న విషయం కాదు. 'డెమోగ్రాఫిక్ డివిడెంట్' పై భారత్‌లో ఎన్నో ఏళ్లుగా చర్చ జరుగుతోంది. అయితే పరిష్కారాల వద్దే సమస్య వస్తోంది. వాటిలో అత్యధికం హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా కాకుండా ..విపరీత ఆదర్శాలు, నినాదాలు ఓటు బ్యాంకు రాజకీయాల రూపంలో ఉంటున్నాయి.

మన దేశ జనాభాలో 65శాతం 35 ఏళ్ల లోపు వారు. 50శాతం 30 ఏళ్ల లోపు వారు. 45 కోట్ల మంది 18 ఏళ్ల లోపు వారు. పని చేయగల సామర్థ్యం ప్రమాణంగా చూస్తే యువత సంఖ్య దేశ జనాభాలో 70 శాతాన్ని మించి ఉంటుంది. అయితే వీరికి ఉపాధిగా ప్రభుత్వాలు తరచూ మార్గం ఏం చూపుతున్నాయి? ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగాల చుట్టూ హామీలను పునరుద్ఘాటిస్తున్నాయి. సమాజంలో మొత్తం వంద ఉద్యోగాలు ఉన్నాయనుకుంటే, అందులో మూడు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటాయి. కానీ అసంఖ్యాకంగా ఉన్నాయన్న భ్రమను కల్పిస్తూ యువతను ఓటు బ్యాంకులుగా కొనసాగిస్తున్నాయి.

సర్కారీ కొలువంటే ఇప్పటికీ వలస కాలం నాటి ఆలోచనా తీరే కొనసాగుతూ, సమాజం మీద పెత్తనం చెలాయించే మార్గంగా కనిపించటం, రాజకీయ వ్యవస్థ బలహీనత కారణంగా జవాబుదారీతనం, ఫలితాలతో సంబంధం లేకుండా, జీవితకాలం భద్రతతో, దిగువ. మధ్య స్థాయి ఉద్యోగాల్లో మార్కెట్ కంటే అనేక రెట్లు ఎక్కువ జీతభత్యాలతో, చాలా సందర్భాల్లో అదనంగా అవినీతి ఆదాయం దండుకునే అవకాశం ఉండడంతో మనదేశంలో యువత ప్రభుత్వ ఉద్యోగాల పట్ల విపరీతంగా

ఆకర్షితులవుతున్నారు. దీన్ని రాజకీయ పార్టీలు పెంచి పోషిస్తున్నాయి. ఉపాధి అంటే ప్రభుత్వ ఉద్యోగమే అనే భావం ఊరూవాడా పాతుకు పోవడానికి పార్టీల పచ్చి అబద్దాల ప్రచారమే కారణం. పచ్చి అబద్ధాలు అని ఎందుకు అనాల్సి వస్తుందో ఈ గణాంకాలు చూస్తే అర్థమవుతుంది.

2014 నుంచి 2022 వరకు 22.05 కోట్ల మంది జాతీయస్థాయి ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, వారిలో కేవలం 0. 33% మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. 2023లో యూపీఎస్సీలో 1255 ఉద్యోగాలకి 13 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ ఐ.టి. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ఒక పత్రిక వ్యాసంలో పేర్కొన్న లెక్క ప్రకారం 0.1 నుంచి ఒక శాతం లోపు యువతకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తున్నాయి .అయినా పార్టీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర ఇలా ఎక్కడ ఎన్నికలు జరిగినా యువతను ఆకర్షించటానికి, ఎదుటి పక్షంపై రెచ్చగొట్టటానికి ప్రభుత్వ ఉద్యోగాల్ని పోటాపోటీ అస్త్రంగా ఉపయోగిస్తున్నాయి.

ఉపాధి విషయంలో ఓటు బ్యాంకు రాజకీయ మోసంలో భాగంగా రాజకీయ పార్టీలు యువతకు ఇంకో నష్టం కూడా చేస్తున్నాయి. ఉపాధికి బదులు నగదు బదిలీల రూపంలో తాత్కాలిక వ్యక్తిగత పథకాల్ని ప్రకటిస్తున్నాయి. నిరుద్యోగ భృతి అని కొన్ని సందర్భాల్లో పేరు తగిలిస్తుండగా, మిగిలిన నగదు బదిలీ హామీల్ని ఉపాధి కల్పనలో భాగంగా, చెప్పాలంటే ఉపాధి కల్పనకు ప్రత్యామ్నాయంగా చూపించే ప్రయత్నం ఉద్దేశపూర్వకంగా చేస్తున్నాయి. కార్మిక బలగంలో తక్కువగా, ఓటర్లలో గణనీయ సంఖ్యలో ఉన్న యువ మహిళల్లో ఇటువంటి పథకాల పట్ల ఆదరణ మరింత ఎక్కువగా కనిపిస్తోంది.

మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ గతంలో ఒక ప్రతిపాదన చేశారు. ఉత్పత్తిలో సాంకేతిక వినియోగం పెరుగుతున్న కారణంగా నిరుద్యోగం ప్రబలే అవకాశం ఉన్నందున సార్వత్రిక ఉచిత ఆదాయ పథకాన్ని అమలు చేయాలన్నారు. కానీ టెక్నాలజీ వల్ల ఉపాధి అవకాశాలకు అంతరాయం ఏర్పడుతుంది తప్ప అంతరించిపోవని, కొత్త అవకాశాలు వస్తాయని, వాటికి తగ్గ నైపుణ్యాలను యువత సంతరించుకుంటే చాలని తర్వాతి అనుభవాలు రుజువు చేస్తున్నాయి. రాబోతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలు ఎలా ఉంటాయో ఇప్పుడు ఊహించడం కూడా కష్టమనే అంచనాలు ఉన్నప్పటికీ, నైపుణ్యాల్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకునే వారి ఉపాధికి ఢోకా ఉండదని ఎక్కువమంది నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతూ, వైవిధ్య భరిత అవకాశాలున్న మన దేశంలో యువత ఉపాధికి ఢోకా ఉండదంటున్నారు. అయితే మిగతా ప్రపంచానికి ఉన్నట్లే మనకూ కొన్ని పెద్ద సవాళ్లున్నాయి. వాటిలో కొన్ని మన రాజకీయం తప్పుల వల్ల మన దేశానికి ప్రత్యేకమైనవి. అత్యధిక స్థాయిలో అసంఘటిత రంగం, నైపుణ్యాల కొరత, ప్రచ్ఛన్న నిరుద్యోగం, తక్కువ ఉత్పాదకత మనల్ని వేధిస్తున్నాయి.

వ్యవసాయదారిత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నుంచి నేరుగా సేవారంగంలోకి మనం పెరగటం, నాణ్యమైన విద్య, ఆరోగ్యాల్ని నిర్లక్ష్యం చేయటం, దశాబ్దాల తరబడి లైసెన్స్ -కోటా- పర్మిట్ రాజ్యాన్ని కొనసాగించటం, ప్రణాళిక లేని పట్టణీకరణ, మౌలిక సదుపాయాలను విస్మరించటం, కుల వివక్ష వంటి కారణాలవల్ల ఎక్కడికి అక్కడ ఉపాధి అవకాశాలను అందుకొని సంపద సృష్టిలో భాగమయ్యే

భారత్‌లో ఉపాధి అవకాశాలున్నా అవసరమైన నైపుణ్యాలున్న యువత దొరకడం లేదని ఇటీవలి అధ్యయనం కూడా వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరినాటికి అవసరమైన నైపుణ్య కార్మికులు 3.2 కోట్ల మంది దాకా తక్కువ ఉన్నారని తెలిపింది. 2027 నాటికి ఈ సంఖ్య 4.9 కోట్లకు చేరవచ్చు. దీనివల్ల ఆటోమొబైల్ , టెక్స్‌టైల్, ఫార్మా, ఆరోగ్య, నిర్మాణ రంగాల్లో ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంది. పునరుత్పాదక ఇంధనం, సెమీ కండక్టర్లు, డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థల్లో సైతం రాబోయే రెండేళ్లలో 20 లక్షల మంది నిపుణుల కొరత ఎదురవనుందని అంచనా. విద్యారంగంలో ప్రభుత్వాలు తగినన్ని నిధులను కేటాయిస్తున్నా, విద్యలో మార్కెట్ ఇప్పుడున్న 11,700 కోట్ల డాలర్ల నుండి 2030 నాటికి 31,300 కోట్ల డాలర్లకు పెరుగుతూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వెల్లువెత్తుతున్నా, నాయకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నాణ్యమైన పాఠశాల విద్య అందకపోవడంతో ప్రధానంగా ఈ పరిస్థితి ఏర్పడింది. మరో వంక ఉన్నత విద్యలో సైతం అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నా సామాజిక కట్టుబాట్ల వల్ల, చట్టబద్ధ పాలన కొరవడటం వంటి కారణాలవల్ల కార్మిక శక్తిలో వీరి పాత్ర ఇంకా గణనీయంగా పెరగలేదు. నిరుద్యోగ రేటు యువకుల్లో తగిన సందర్భాల్లో సైతం యువతుల్లో పెరుగుతున్న వైనం కనిపిస్తోంది .ఉదాహరణకు తెలంగాణలో 20 23 జూలై..సెప్టెంబర్ మధ్య మహిళల్లో నిరుద్యోగ రేటు 24.3శాతం ఉంటే 2024 లో అదే కాలానికి 31.3 శాతానికి పెరిగింది.

సంస్కృతి మనవద్ద విస్తరించలేదు. ప్రభుత్వ ఉద్యోగాల వేలం వెర్రి, తప్పుడు ప్రచారం నుంచి సమాజం, రాజకీయ వ్యవస్థ బయటకు వచ్చి-- పెట్టుబడులు, మార్కెట్, నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, గ్రామాల మధ్యే చిన్న పట్టణాల అభివృద్ధి, సేవారంగాన్ని ప్రోత్సహిస్తూనే ఉత్పత్తి రంగాన్ని అభివృద్ధి చేయటం, ఎక్కువ పని, తక్కువ పని అనుకోకుండా సమాజానికి ఉపయోగపడే ప్రతి పనిని విలువైన ఉపాధి అవకాశంగా భావించడం, చట్టబద్ధ పాలన మొదలైన అంశాల మీద దృష్టి పెడితే నాణ్యమైన ఆదాయాలతో జీవన భద్రత నిచ్చే సంఘటితరంగ ఉపాధి అవకాశాలు మన యువతకు ప్రతి ప్రాంతంలో అందుబాటులోకి వస్తాయి. మహానగరాలకు పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లి అక్కడ దుర్భర జీవితాలు గడుపుతూ, కోవిడ్ సమయంలోల విపత్తులు వచ్చినప్పుడు నిస్సహాయంగా సొంతూళ్లకు తిరుగు వలసలు అవసరం లేకుండా, సుఖసంతోషాల నాణ్యమైన జీవన ప్రమాణాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. అయితే నగదు బదిలీలు, ఇతర తాత్కాలిక సంక్షేమ పథకాలు అసలు వద్దనడం సరికాదు. అవి ఉత్పాదకంగా, యువతలో స్వావలంబన పెంచేలా, అసంఘటిత రంగంలో ఉన్నవారు సంఘటిత రంగంలోకి వచ్చేలా ఉండాలి. ఉదాహరణకు నిరుద్యోగ భృతిలా కాకుండా యువతలో నైపుణ్యాలు పెంచేలా సామమందించాలి. ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగం పరిస్థితి మార్చాలి .ఇటీవల వరుస ఎన్నికల్లో ఈ దిశగా యువత కొన్ని బలమైన సంకేతాలివ్వటం సానుకూల పరిణామం. తాయిలాలు తీసుకునే ఓట్లేస్తాం, కానీ ఒక పరిధి దాటి వాటికి విలువనివ్వం, వన్ టైం ఓటుకి అవి పరిమితం అని తీర్పునివ్వడం ద్వారా..నాణ్యమైన ఉపాధి అవకాశాల కల్పనకి వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలు ప్రత్యామ్నాయం కాదని, అభివృద్ధి- సంక్షేమం మధ్య సమతుకం ఉండాలని స్పష్టం చేస్తున్నారు. ఈ రకమైన సమ్మేళత అభివృద్ధే ఈవేళ్టి యువ భారత్ కి అత్యావశ్యకం.

ఇప్పుడు భారత్ లో సుమారు 27 కోట్ల మంది స్కూళ్లలో చదువుతున్నారు. త్వరలో యువత కాబోతున్నారు. ఉపాధి నైపుణ్యాలు, అవకాశాల్ని అందుకునే, సృష్టించే సామర్థ్యం వారికి అలవాడాలంటే, పాఠశాల విద్య నుంచి ప్రమాణాలు అందేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. రాజకీయ, పాలనా సంకల్పం తప్ప ఇందుకు అదనపు ఖర్చు కూడా అవసరం లేదు .అదే విధంగా మౌలిక వసతులు, పెట్టుబడులను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను పెంచేందుకు యువతలో పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల్ని మొగ్గలోనే అదుపు చేసే సమగ్ర ఆరోగ్య వ్యవస్థను వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా ఏర్పాటు చేయాలి. అప్పుడు మాత్రమే యువత సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తారు. లేకుంటే అందుకు వ్యతిరేక శక్తులుగా అస్థిరతకు దారి తీస్తారు.

**రాజకీయ వ్యవస్థలో..**

యువశక్తిని సద్వినియోగం చేసుకోవడానికి మనదేశంలో జరగాల్సిన రెండో పెద్ద దిద్దుబాటు రాజకీయ వ్యవస్థలో ఉంది. దేశం వందో స్వాతంత్ర్య దినోత్సవానికి అడుగులు వేస్తున్న కొద్దీ యువత సంఖ్య పెరుగుతున్నా కేవలం కొందరు పాతుకుపోయిన నాయకులు కుటుంబ సభ్యులకు, సంపన్నులకు తప్ప, అత్యధిక సంఖ్యలో ఉన్న సామాన్య, మధ్య తరగతి యువతకు తమ వినూత్న ఆలోచన క్రియాశీలకంగా పంచుకునే అవకాశం ప్రజాస్వామ్య భారతంలో చాలా తక్కువ ఉంటోంది.

**ఏళ్లూ, దశాబ్దాలు పట్టనక్కర్లేదు**

ఇంకోటి ఈవేళ్టి యువత చాలా వేగంగా ఫలితాల్ని కోరుకుంటున్నారు. వినూత్న ఆలోచనల్లో, పరిష్కారాల్లో సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్నారు. సమన్వయం, సంయమనంతో ఆచితూచి వ్యవహరించాల్సిన రాజకీయాలు, పాలనలో ఈ వేగం అన్నివేళలా ఫలితాలనివ్వకపోవచ్చుగానీ, మౌలిక మార్పుల కోసం ఇప్పుడు జరుగుతున్నట్లు సంవత్సరాలు, దశాబ్దాల కాలమైతే పట్టనక్కర్లేదు. పార్టీలో ఒక సమర్థ, నిబద్ధ నాయకుడు ఎదగటానికి ఏళ్ల తరబడి సమయం అవసరం లేదు. కాబట్టి నిజాయితీ, సామర్థ్యం, ప్రజాసేవాతత్పరత గల యువత నాయకులుగా సహజంగా ఎదిగేందుకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి .

**స్థానిక ప్రభుత్వాలనుంచి**
**నాయకత్వం ఎలా తయారవుతుంది?**

ఇందులో భాగంగా ప్రజాస్వామ్యానికి పాఠశాల లాంటి స్థానిక ప్రభుత్వాల్ని బలోపేతం చేయాలి. ఎదగటానికి వీలుగా పార్టీల్ని ప్రజాస్వామీకరించి, సభ్యుల ఆస్తిగా చేసి పదవులు, టికెట్ల పంపిణీలో వారి అభిప్రాయాలకు విలువనిస్తే.. సమర్థులు, నిజాయితీపరులైన నాయకులు పై స్థాయి వరకూ పోటాపోటీగా కనిపిస్తారు. ఎన్నికల్లో ఎంతెంత డబ్బు అక్రమంగా ఖర్చు చేయాల్సి వస్తుందో ఎన్డీఏలో భాగస్వామి, తెలుగుదేశం తరపున యూనియన్ మంత్రి వర్గంలో ఉన్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల బహిరంగంగా చెప్పారు. అదానీపై ఆరోపణల సారాంశం కూడా అదే కాబట్టి అక్రమ ఖర్చును అరికట్టే, సమర్థులు చట్టసభకు ఎన్నికయ్యేలా ఎన్నికల వ్యవస్థలో మార్పులు తేవాలి. ✩

# ఆ దేశాలూ ఒకప్పుడు అవినీతిపై యుద్ధం చేసినవే

సోమ శ్రీనివాసరెడ్డి
ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

స్వాతంత్ర్య అనంతరం స్వపరిపాలనలో హక్కుగా పొందే సేవలను ప్రజలు తెలియక, పని పూర్తయిన తర్వాత అధికారికి ఏదో ఒక కానుకను ఇచ్చేవారు. అది ఒక ఆనవాయితీగా మారింది. మీరు హక్కుగా పొందే సేవలను మేము ఏమీ ఆశించకుండా పనిచేయాలని, దానికి ప్రభుత్వం నుండి జీతాలు పొందుతున్నామని అధికారులు ప్రజలకు ఎప్పుడూ చెప్పలేదు. రాను రాను అధికారులు కానుకలు తీసుకోవడం తమ హక్కుగా భావిస్తూ వచ్చారు. క్రమంగా ప్రతి పనికి ఆ కానుకలనే లంచం రూపంలో తీసుకోవడం వారికి అలవాటైంది. ప్రజాస్వామ్య పాలనలో మన అభివృద్ధికి ఈ అవినీతి ఆటంకమని తెలుసుకోలేక సతమతమవుతున్నాం.

పాలనలో అవినీతిని అరికట్టడం పెద్ద సవాల్. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే గానీ అవినీతిని అరికట్టడం సాధ్యం కాదు. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలూ ఒకనాడు తమ పాలనా వ్యవస్థలో అవినీతిపై యుద్ధం చేసిన వారే. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సొమ్ముతోనే ప్రభుత్వాలు నడుస్తాయి. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను అభివృద్ధికి, సేవలకు, సంక్షేమ సాధనకు నిజాయితీగా ఖర్చు చేస్తే ప్రజలకు ఆ ప్రభుత్వంపై నమ్మకం కలిగి పన్నులు ఆనందంగా చెల్లిస్తారు. ఇప్పుడు ప్రజలకు మన ప్రభుత్వాలపై నమ్మకం సన్నగిల్లింది.

అవినీతి రెండు రకాలు. ఒకటి రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు కుమ్మక్కై జరిపి అవినీతి. ఇది పెద్ద ఎత్తున జరిగే అవినీతి. దీనిలో ప్రజాధనం పెద్ద ఎత్తున రాజకీయ నాయకుల, వ్యాపారస్తుల పాలవుతుంది. చిరు అవినీతి– అంటే ప్రజలు తమ దైనందిన జీవితంలో మునిసిపాలిటీలో, రెవెన్యూ ఆఫీసులో, పోలీస్ స్టేషన్‌లో చెల్లించే లంచాలు. పరిస్థితులు ఎంతగా దిగజారాయంటే సామాన్యుడు లంచాన్ని ఒక అదనపు పన్నుగా ఓర్చుకుంటున్నాడు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రతి పనికి ఒక ధరను నిర్ణయించి ఆ పనులు చేస్తారన్న విషయం తెలిసిందే. ఇది ఒక దురాచారం. సంఘసంస్కర్తలు ప్రజలను చైతన్యపరిచి ఎన్నో సాంఘిక దురాచారాలను రూపుమాపారు. అయితే అవినీతిని నిర్మూలించలేకపోయారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అవినీతిని అదుపు చేసేందుకు ఎన్ని కట్టుదిట్టమైన చట్టాలు తెచ్చినా ఆ మహమ్మారిని నిర్మూలించడం సాధ్యపడలేదు. క్రమేపి అరికట్టడంతో సర్దుకుపోవాలి. పాలనలో అవినీతి వలన జరిగే నష్టాలు అతి



ప్రమాదకరమైన ప్రభావం చూపుతాయని ప్రజలకు విశదీకరించాలి. ప్రజలలో అశాంతి, అలజడి, కుంగుబాటుతనం, దొంగతనాలు, అరాచకాలు, హత్యలు, అభద్రతాభావం ఒకరిపై ఒకరికి అపనమ్మకం ఈర్ష్యా ద్వేషాలు, కోపం పెరిగి సామాజిక పతనం సంభవిస్తుంది.

మనం నిర్మించుకున్న వ్యవస్థలపైనే మనకు సందేహం. రాజకీయ నాయకుల పై ప్రజలకు నమ్మకం లేకపోతోంది. దీంతో అవినీతి ప్రజల జీవన విధానంలో ఒక భాగమైపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఎక్కువ శాతం మంది ఉద్యోగస్తులు అవినీతిపరులే. లంచాలకు అలవాటు పడ్డ అధికారులకు వారికి వచ్చే జీతంతో పనిలేదు. వచ్చే లంచాల ముందు వారి జీతం చాలా తక్కువ. వచ్చే లంచాలతో విలాసవంతమైన జీవితాలు అలవాటు పడి తాము చేయవలసిన ఉద్యోగ బాధ్యతలను, అందించవలసిన ప్రజా సేవలను పూర్తిగా మరిచి లేని దానికీ కాని దానికీ ఏదో ఒక కారణం చూపుతూ, ప్రతిదానికీ లంచం ఇస్తే గాని పనిచేయని దౌర్భాగ్యస్థితి ఉన్నది. ప్రజలు కూడా గత్యంతరం లేక లంచాలు ఇవ్వడానికి అలవాటు పడ్డారు. ఎవరైనా నిజాయితీగా మెలగాలన్నా, మెలిగే పరిస్థితి లేని సమాజం ప్రస్తుత ఉంది. పైగా నిజాయితీగా ఉంటే బతకలేని వాడని, చేతకాని వాడని సమాజమే నిర్వచిస్తుంది. అవినీతి వలన సమర్థత తగ్గి అసమర్థులు పెరుగుతున్నారు. అవినీతి నిరోధక శాఖ పనిచేస్తున్నప్పటికీ రాజకీయ నాయకుల

జోక్యంతోనూ, చట్టాలను నిజాయితీగా అమలు చేయలేకపోవడం వలనా ఉద్యోగులలో మార్పు రావడం లేదు. మరొకవైపు రాజకీయ అవినీతి, అన్ని రకాల ఆర్థిక కుంభకోణాలు మన దేశాన్ని కుంగదీస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన స్వల్ప కాలంలోనే స్వాతంత్ర్యం కోసం పోరాడిన విలువలు కలిగిన నాయకులను ఈ దేశం కోల్పోయి అనుభవం లేని నాయకుల చేతుల్లోకి వెళ్లి ఇంత పెద్ద దేశాన్ని ఒక మంచి మార్గంలో నడపడం అసాధ్యం అవుతుంది.

అవినీతిని అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో సేవలు ఆన్లైన్లోనే అందిస్తున్నా, అవినీతికి అలవాటు పడిన ఉద్యోగస్తులు కొత్త కొత్త మార్గాలను కనిపెడుతున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అని కాకుండా రాజకీయ నాయకులకు అవినీతిని నిర్మించాలని ఉద్దేశమే లేదు. అవినీతి నిరోధక శాఖ, డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ కమిషన్, లోకాయుక్త వంటి సంస్థలకు పదును పెట్టాలి. ప్రతి కార్యాలయంలో సిటిజన్ చార్టర్లు తయారుచేసి ఏ పని ఎన్ని రోజులలో చేస్తారో తెలుపుతూ బోర్డులు పెట్టాలి. అలాగే సమాచార హక్కు చట్టం ద్వారా

**అవినీతి నిరోధక శాఖ, డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ కమిషన్, లోకాయుక్త వంటి సంస్థలకు పదును పెట్టాలి. ప్రతి కార్యాలయంలో సిటిజన్ చార్టర్లు తయారుచేసి ఏ పని ఎన్ని రోజులలో చేస్తారో తెలుపుతూ బోర్డులు పెట్టాలి. అలాగే సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి.**

పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి. ప్రజలు కూడా కొద్దో గొప్పో ఇబ్బంది కలిగినప్పటికీ లంచాలు ఇవ్వకుండా పనులు చేయించుకునే అలవాటు నేర్చుకోవాలి అవినీతిపరులైన ఉద్యోగుల నుంచి ఆరంభంలో ఎదురైన ప్రతిఘటన ఎక్కువకాలం కొనసాగదని గుర్తించాలి. అవినీతికి వ్యతిరేకంగా బలమైన, వ్యవస్థీకృతమైన పోరాటం జరిగినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ✰




## జేపీ కమిటీ సిఫార్సులకు మద్దతు తెలిపిన మన్మోహన్ సింగ్

భారత రాజకీయాల్లో పలు కీలక పదవులను నిర్వర్తించి, దేశ ఆర్థిక రంగం శక్తి సామర్థ్యాలను వికసింప చేసి, కొత్త దిశను ఇచ్చిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని లోక్‌సత్తా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నివాళులర్పించారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో 2018లో తాము మన్మోహన్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిశామన్నారు. ఏపీకి విభజన అనంతరం చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, ప్రత్యేక హోదాపై, లోక్‌సత్తా , ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పార్టీలకతీతంగా నిపుణులతో కలిసి రూపొందించిన సమగ్ర నివేదికను అందజేసి సిఫార్సులకు మద్దతు కోరామని వివరించారు. మన్మోహన్ సంతోషంగా మద్దతు తెలియజేశారని, జేపీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారని ఈ సందర్భంగా బాబ్జీ పేర్కొన్నారు.

### యువత ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

వస్తు సేవలల్లో లోపం జరిగితే, కల్తీ ఇతర మోసాలుంటే యువత వెంటనే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలని విజయనగరం జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ యువతకు విజ్ఞప్తి చేశారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా లెండి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరిబాబు, పౌరవేదిక కార్యదర్శి రామ్మోహన్‌రావు, కనకాచారి, ఎస్‌విఎస్ బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంత డబ్బు ఖర్చు చేస్తున్నా.. చదువు ఎందుకు రావటం లేదో అడగాలి

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



విద్య అంటే బట్టీ పట్టడం మార్కులు సాధించడం కాదని ప్రతిభను వెలికి తీయడం అనే లక్ష్యంతో పిల్లల పండుగను క్రియా సొసైటీ నిర్వహిస్తుందని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్యార్థుల విజ్ఞానంతో పాటు మానసిక వికాసాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. క్రియా సొసైటీ తెలుగు రాష్ట్రాల స్థాయి అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలు రెండు రోజులపాటు కాకినాడ జేఎన్టీయూకే లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేపీ హాజరయ్యారు. శాస్త్రీయ నృత్యాలు, నాటికలు, కోలాటం, పాటలు, పోస్టర్ ప్రజెంటేషన్, సైన్స్ ప్రయోగాలు, వక్తృత్వం,





మ్యాప్ గణితం, తర్కం, క్విజ్, వ్యాసరచన, కథారచన ,కథా విశ్లేషణ, ఇంటర్నెట్ సెర్చ్ మొదలైన అంశాలలో పోటీలు నిర్వహించారు. క్రియా అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ సైన్స్ సెంటర్ స్టాల్ ఏర్పాటు చేసింది. పదాల చారిటబుల్ ట్రస్ట్ స్వేచ్ఛ పేరిట బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతను తెలియజేసింది. జేఎన్టీయూకే ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ మురళీకృష్ణ, డాక్టర్ కాదా వెంకటరమణ, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డిఎన్ మూర్తి ,చంద్రు జానకి రామ ప్రసాద్, మాచిరాజు, అల్లూరి సురేంద్ర, క్రియా కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, పదాల సూర్యప్రసాద్, జగన్నాథరాజు, రామ కృష్ణరాజు, ఆలపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే పిల్లల్లో ప్రతిభ ప్రపంచానికి తెలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వ పాఠశాలల్లో రూ 1.5 లక్షలు ఖర్చు చేస్తున్నా సరైన చదువు ఎందుకు రావడం లేదో పన్నుల కట్టేవారిగా మనమంతా ప్రశ్నించాలని బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతూ జేపీ విజ్ఞప్తి చేశారు.



# స్థానిక సంస్థలు కాదు, స్థానిక ప్రభుత్వాలుగా పిలవాలి

-బండారు రామ్మోహనరావు

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో ఆర్టికల్ 40 లో లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ అని చేర్చారు. దీన్ని తెలుగులోకి అనువదిస్తే స్థానిక స్వపరిపాలన చేసే ప్రభుత్వం అనే అర్థం వస్తుంది. అందుకే గ్రామ, మధ్యంతర, జిల్లా స్థాయి, పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా పిలవాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కూడా ఇలాగే స్థానిక ప్రభుత్వాలనే అనాలి.

73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం పంచాయతీలు , మున్సిపాలిటీలు, గ్రామ, పట్టణ, నగర ప్రభుత్వాలుగా పిలవాలి. 1994 లో ఆమోదించిన పై సవరణ ప్రకారం ,రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధత ఏర్పడింది. పార్లమెంటు, అసెంబ్లీ లాగానే స్థానిక ప్రభుత్వాలకు కూడా 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం చట్టబద్ధత వచ్చింది.

**73,74 రాజ్యాంగ సవరణలు కేటాయించాల్సిన అంశాలు**

73వ రాజ్యాంగ సవరణకు ముందు రాజ్యాంగంలో జాతీయ ప్రభుత్వం చేసే పనులు యూనియన్ లిస్టు, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే పనులు స్టేట్ లిస్టు, ఇద్దరికీ కలిపి కేటాయించే అంశాలు కంకరెంట్ లిస్టుగా విభజించారు. స్థానిక ప్రభుత్వాలకు విధిగా కేటాయించిన విధులు మొదట భారత రాజ్యాంగంలో లేవు. జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీదే స్థానిక ప్రభుత్వాలు ఆధారపడి ఉండేవి. 73వ రాజ్యాంగ సవరణ తర్వాత 29 విధులను పంచాయతీ వ్యవస్థకు, 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం 18 విధులను మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలకు కేటాయించారు. జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధులను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలి. దేశంలోని కేరళ ,పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాష్ట్రాలు కొంత వరకు, ఎక్కువగా అమలు చేశాయి. ఈ విషయంలో మన తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కేవలం 11, 12 అంశాలు మాత్రమే స్థానిక ప్రభుత్వాలకు బదలాయించి దేశంలో అధ్వానంగా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వాల స్ఫూర్తిని నీరుగార్చాయి.

**తలసరి గ్రాంట్ కథ కమామీషు**

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ, తెలంగాణ స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చే తలసరి గ్రాంట్ చూస్తే మతిపోతుంది.



జనాభా ప్రకారం గ్రామపంచాయతీలకు తల ఒక్కింటికి సంవత్సరానికి రూ.4. మండలాలకు తల ఒక్కింటికి సంవత్సరానికి 8 రూపాయలు. జిల్లా పరిషత్తులకు తల ఒక్కింటికి రూ.4 మాత్రమే ఇస్తున్నాయి. ఒక గ్రామ జనాభా వెయ్యి అనుకుంటే సంవత్సరానికి ఆ గ్రామానికి వెయ్యి ఇంటూ నాలుగు వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం విదిలిస్తోంది. మిగతా రాష్ట్ర ప్రభుత్వాలను చూస్తుంటే ఆయా రాష్ట్రాలు బడ్జెట్లో తలసరి 20 రూపాయల నుండి 50 రూపాయల దాకా పంచాయతీలకు ఇస్తున్నాయి. కేరళ రాష్ట్రం పంచాయతీలకు 50 శాతం నిధులు కేటాయిస్తోంది.

**ఎంపీ, ఎమ్మెల్యేల రాజ్యాలు పోవాలి**

ప్రస్తుతం గ్రామ, మండల, జిల్లా పరిపాలన ఎమ్మెల్యేలు, ఎంపీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోట, కేంద్ర ప్రభుత్వం ఎంపీలకు నియోజకవర్గ అభివృద్ధి నిధులు 5 కోట్ల రూపాయలు సంవత్సరానికి ఇస్తున్నారు. ఆ నిధులు ఆయా జిల్లాల కలెక్టర్లు కార్యనిర్వాహక అధికారులుగా పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఖర్చు చేయాలి. దానికి స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన



ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూతూ ప్రదక్షణలు చేయాల్సి ఉంటుంది. వారు కరుణిస్తే అభివృద్ధి, వారు శీతకన్ను వేస్తే దరిద్రం పరిస్థితి ఇలా ఉంది.

స్థానిక ప్రభుత్వాల పరిస్థితి 73, 74 రాజ్యాంగ సవరణలకు ముందు మరోలా ఉండేది. సవరణతో కాగితాల మీద అధికారం అయితే వచ్చింది కానీ, వాస్తవానికి క్షేత్రస్థాయిలో అనుభవం మరోలా ఉంది. రాజ్యాంగ సవరణకు ముందు పంచాయతీలు, సమితులు, జిల్లా పరిషత్తులకు నిధులు, విధులు పుష్కలంగా ఉండి అభివృద్ధికి బాటలు వేసేవారు. ఆనాటి పంచాయతీ సమితి ఎమ్మెల్యే కంటే శక్తివంతమైంది. జిల్లా పరిషత్ చైర్మన్ క్యాబినెట్ మంత్రి కంటే శక్తివంతుడుగా ఉండేవాడు. జిల్లాకు రాజుగా జడ్పీ చైర్మన్ ఉంటే పంచాయతీలు, 40 ప్రభుత్వ శాఖలకు అధిపతిగా ఉండి విద్యా, వైద్యం, మౌలిక వసతులు కల్పన, వ్యవసాయం, పశుపోషణ ఇలా చాలా శాఖలు సమితి, జిల్లా పరిషత్ ఆధీనంలో ఉండేవి.

ఎమ్మెల్యే, ఎంపీలు చట్టసభలలో మంచి ప్రజా ఉపయోగ కరమైన చట్టాలు చేసే విధంగా పనిచేయాలి. కానీ స్థానిక ప్రభుత్వాల పనిలో జోక్యం చేసుకోవడం తగదు. ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి.

**పౌరుడు కేంద్రంగా పాలన**

పుర్రెకో బుద్ధి..జిహ్వకో రుచి.. అన్నారు పెద్దలు. అంటే ఎవరెవరి ఆలోచనలు వారివే. ఎవరి జిహ్వ చాపల్యాన్ని బట్టి వారు తినే పదార్థాలను ఎంచుకోవచ్చు. అది వారి వ్యక్తిగత ఇష్టం. అదే కుటుంబంలో తమ అమ్మాయి పెళ్ళి చేయాలనుకుంటే తల్లిదండ్రుల ఇష్టం మాత్రమే చెల్లదు . మొదట పెళ్లి చేసుకోబోయే అమ్మాయిని అడగాలి, ఆ తర్వాత అబ్బాయి తరుపువారిని అడగాలి. ఇటు అటు ఏడు తరాలు చూడాలంటారు. అమ్మాయి పెళ్లి దగ్గరికి వస్తే వ్యక్తి స్వేచ్ఛ హరించింది. కుటుంబానికి అధికారం వచ్చింది. మన ఒక్కరి కోసం మన ఇంటి ముందు రోడ్డు వేసుకోలేదు అలాగే మన పిల్లల కోసం మనం ఒక స్కూలు పెట్టుకోలేము. అలాగే మన కుటుంబం కోసం మాత్రమే ఒక ఆసుపత్రి కట్టుకోలేము . ఇలా సమిష్టి కోసమే స్థానిక ప్రభుత్వాలు కావాలి.

ఒక రోడ్డు ఉదాహరణ తీసుకుంటే మన ఊళ్లో రోడ్డును వేయాలంటే గ్రామపంచాయతీ వేయాలి. మన ఊరు నుండి మరో పక్క ఊరికి వేయాలంటే మండల పరిషత్ చూడాలి. అలాగే ఒక మండలం నుండి మరో మండల కేంద్రంలో రోడ్డు వేయాలంటే జిల్లా పరిషత్తు, జిల్లా నుండి మరో జిల్లాకు రోడ్డు రాష్ట్ర ప్రభుత్వం. ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి రోడ్డు వేయాలంటే జాతీయ రహదారుల సంస్థ ఇలా అంచెలంచలుగా పనుల విభజన జరుగుతుంది. ఇది ఒక్క రోడ్డు విషయమే కాదు అన్ని పనులకు ఇలా కింది నుండి పైకి పని పరిధిని బట్టి వికేంద్రీకరించాలి. కానీ వాస్తవంలో మన దేశంలో గ్రామంలో వేసే రోడ్డుపని ప్రధానమంత్రి సడక్ యోజన కింద, ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కోసం సర్వ శిక్ష , మన ఊళ్లో ఆశా వర్కర్ నియామకం జాతీయ ఆరోగ్య మిషన్ కింద జరుగు తున్నాయి. అంటే గల్లీలో సమస్యలకు ఢిల్లీలో పరిష్కారాలు వెతకడం లాంటిది. మన ఊళ్లో మన పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే పౌరుల కేంద్రంగా పాలన సాగాలి. దీన్నే థీరీ ఆఫ్ సబ్సిడియారిటీ అంటారు.

ఇలా ఇంటి ముందు ప్రభుత్వం.. కంటి ముందు పాలన జరగాలంటే అధికార వికేంద్రీకరణ సూత్రం పాటించాలి. దీని వ్యతిరేకులు ఒక వాదం మన ముందుకు తెస్తారు. అదేమిటంటే కింది స్థాయిలో పనిచేసే ప్రజాప్రతినిధులు అవినీతిపరులు, వారి పాలనా సామర్థ్యం తక్కువ, వారికి పాలించే అర్హతలు లేవు, చదువు, ఇతరత్రా తెలివితేటలు ఉండవు దాంతో అధికార వికేంద్రీకరణ కాస్త, అవినీతి వికేంద్రీకరణగా మారుతుందని అంటారు. స్థానికంగా అధికారాల వికేంద్రీకరణ వద్దనే వారి వాదన ఇలా ఉంటుంది. అందుకే ఏ అంచెకు ఆ అంచేలో అవినీతి జరగకుండా చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఏర్పాటు చేయాలి. అంటే స్థానిక ప్రభుత్వాల అవినీతిపై అంబుడ్స్‌మెన్‌ను నియమించాలి. ఈ వ్యవస్థ ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో ఉంది. అంబుడ్స్‌మెన్ క స్వతంత్ర సంస్థగా ఉండి, స్థానిక ప్రభుత్వాలలో బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించిన ప్రజాప్రతినిధులను విచారించి చర్య తీసుకునే అధికారం ఉండాలి. తప్పుకి శిక్ష, మంచిని ప్రోత్సహించే విధంగా ఉండాలి.


❖

# ఏపీ, తెలంగాణలో గ్రామ న్యాయాలయాలు ఎక్కడ?

తెలంగాణలో నోటిఫై చేసిన 55 గ్రామ న్యాయాలయాల్లో ఒకటి పనిచేయడం లేదని యూనియన్ న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్ ఇటీవల రాజ్యసభలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో 42 ఏర్పాటు చేయాల్సి ఉండగా ఒక్కటీ పట్టా లెక్కలేదు.

లోక్‌సత్తా కృషితో 2009లో గ్రామ న్యాయాలయాల చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. లా కమిషన్ గ్రామ న్యాయాలయాల వరకే సిఫార్సు చేయగా ఆ చట్టాన్ని స్థానిక కోర్టుల ఏర్పాటు చట్టంగా మార్చాలని ఆ మేరకు బిల్లు తయారు చేసింది. స్థానిక కోర్టుల చట్టమైతే గ్రామాలకే పరిమితం కాకుండా, నగరాల వరకు అన్ని ప్రాంతాల్లో చిన్న నేరాలని వెంటనే పరిష్కరించి తగిన శిక్షలు విధించవచ్చు. దీనివల్ల కేసుల భారం తగ్గడమే కాకుండా, న్యాయం పెద్ద ఖర్చు లేకుండా, సామాన్యులకు కూడా అందుబాటులోకి వస్తుంది. ముఖ్యంగా మహిళలపై పెద్ద నేరాలు జరగకుండా , ఈవ్ టీజింగ్ వంటివి తొలి దశలోనే అదుపు చేసే అవకాశం లభిస్తుంది. పట్టణీకరణ వల్ల అభివృద్ధి జరగడంతో పాటు నేరాలు కూడా పెరుగుతుంటాయి. ఈ రకంగా దేశంలో గత పది ఏళ్లలో నేరాల సంఖ్య 55% మేర పెరిగిందని అంచనా. అయితే తొలుత గ్రామ న్యాయాలయాల వరకు పరిమితం చేసి, తర్వాత స్థానిక కోర్టుల చట్టం చేద్దామని అప్పట్లో యూపీఏ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రత్యేకించి పెద్ద మార్పులు ఏవీ లేకుండానే గ్రామ న్యాయాలయాల చట్టాన్ని స్థానిక కోర్టుల చట్టంగా మార్చి పట్టణ, నగర ప్రాంతాల్లో అమలు చేయవచ్చు. దీనిపై శాసనసభ్యుడిగా లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. యూనియన్ ప్రభుత్వమే నిధులు ఇస్తోంది.. మీరు చొరవ చూపితే చాలు అని చెప్పినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించలేదు .రెండు రాష్ట్రాలై పదేళ్లయినా ఇప్పటికీ కదలిక లేదు.

దేశవ్యాప్తంగా తొలుత ఐదువేల గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు చేయాలని యూనియన్ ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లో 488 గ్రామ న్యాయాలయాలు ప్రారంభమయ్యాయి. మధ్యప్రదేశ్ నోటిఫై చేసిన మొత్తం 89 న్యాయాలయాలను ప్రారంభించి మొదటి



స్థానంలో నిలిచింది. కేరళ 30, రాజస్థాన్ 45, రాష్ట్రాలు కూడా 100% గ్రామ ఉత్తర ప్రదేశ్‌లో 11393 మహారాష్ట్రలో 39కి 26 ఒడిశాలో 31కి 21 గ్రామ న్యాయ సంస్థలు కొలువుదీరాయి. తెలుగు రాష్ట్రాలు సహా జమ్మూ కాశ్మీర్ లఢాక్ మరికొన్ని వీటికి దూరంగా ఉన్నాయి.

హైకోర్టు నియమించే న్యాయాధికారుల ద్వారా గ్రామ న్యాయాలయాలు కేసులను విచారించి పరిష్కరిస్తాయి. గ్రామ న్యాయాలయాల ఏర్పాటు, వాటిలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ కోసం మూడేళ్లపాటు యూనియన్ ప్రభుత్వము, రాష్ట్రాలకు నిధులు ఇస్తాయి. 488 గ్రామ న్యాయాలయాల కోసం జాతీయ స్థాయి ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 83.40 కోట్లు మంజూరు చేసింది. వాటిలో తెలంగాణకు 6.93 కోట్లు, ఏపీకి 4.36 కోట్లు కేటాయించింది. యూనియన్ ప్రభుత్వం నిధులిచ్చినా రాష్ట్రాలు ఉదాసీనంగా వ్యవహరించడంపై ఇటీవల సుప్రీంకోర్టు కూడా అసహనం వ్యక్తం చేసింది. ఇప్పటివరకు ఎన్ని గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు చేశారు, ఎన్నిట్లో మౌలిక సదుపాయాలు కల్పించారనే వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది .ప్రజాస్వామ్యానికి కీలకమైన న్యాయం అందరికీ వేగంగా, చౌకగా అందుబాటులోకి తెచ్చి, కోర్టులపై ప్రజల్లో విశ్వాసం సడలకుండా చేసేందుకు, మహిళల భద్రతకు భరోసా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ న్యాయాలయాల చట్టాన్ని స్థానిక కోర్టుల ఏర్పాటుతో వెంటనే అమలు చేయాలి. ❖

(17వ పేజీ తరువాయి)

# భారత్‌లో సాధ్యమా?

భారత్‌కి స్వతంత్రం వచ్చి సుమారు పాతికేళ్లు గడిచాక, 1975లో అత్యధిక పరిస్థితి విధించిన సమయంలో దేశ తలసరి ఆదాయం 158 డాలర్లు. ఈవేళ అనేక రెట్లు ఎక్కువగా 2700 డాలర్లు దాకా ఉంది. కానీ దక్షిణ కొరియాతో పోలిస్తే మనం ఎక్కడ? మనం ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ కావడానికి పోటీ పడుతుండొచ్చు. కానీ కోట్లాదిమంది భారతీయులు అభివృద్ధి చెందిన దేశాల పరంగా చూస్తే ఇంకా పేదరికంలో, ముడుచు కుపోయిన జీవితంలో ఉన్నారు. అదేవిధంగా వికేంద్రీకరణ ప్రభుత్వంలో లేదు, పార్టీలోనూ లేదు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించినప్పుడు ప్రభుత్వంలో, పార్టీలో, చివరికి రాజ్యాంగ వ్యవస్థలోనూ ప్రశ్నించిన వారు అరుదు. ఇందిరే ఇండియా అనే బాహాటంగా ప్రచారం చేసుకునే వ్యక్తి పూజ రాజ్యమేలింది.

ఇందిర అత్యయిక పరిస్థితి విధించడానికి కొన్ని తక్షణ కారణాలుండొచ్చు. ఉదాహరణకి, ఇజ్రాయిల్ పై 1973 చివర్లో ఈజిప్ట్, సిరియా, కొన్ని అరబ్ దేశాలు కలిసికట్టుగా చేసిన రమదాన్ యుద్ధం. ఇందులో ఓటమిపాలైన అనేక దేశాలు చమురు ధరలని 70 శాతం దాకా పెంచడంతో భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపుతప్పి ధరలు విపరీత మయ్యాయి. ఇందిరాగాంధీ పాలన పట్ల ప్రజల్లో అసంతృప్తి, అసహనం పెరిగాయి. అయితే ఈ అసంతృప్తి ఆగ్రహ జ్వాలగా ప్రభుత్వాన్ని చుట్టుముట్టటానికి, ఇందిర ప్రజాదరణ కోల్పోవడానికి మౌలిక కారణాలు దేశంలో కొనసాగుతున్న పేదరికం, నిరుద్యోగం, ప్రబలిన అవినీతి, పరిష్కారాలు విధానపరంగా, వ్యవస్థల నిర్మాణ పరంగా ఉండగా, ఆ వాస్తవాన్ని విస్మరించి ఇందిర ఎమర్జెన్సీని ప్రకటించారు. ఆమెను గద్దె దించితే చాలు దేశంలో ప్రజా స్వామ్యం, సుపరిపాలన నెలకొంటాయన్న భ్రమను లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ సహా ఎమర్జెన్సీ వ్యతిరేక నేతలు దేశంలో వ్యాపింప చేశారు. వ్యవస్థీకృత మార్పులపై ప్రజల్లో అవగాహన పెంచి మార్పు సాధించే ప్రయత్నం చేయకుండా నినాదాలతో అధికార మార్పిడికి పరిమితం కావడం వల్ల పాలన, రాజకీయ లోపాలు ఇప్పటికీ గణనీయ స్థాయిలో కొనసాగుతున్నాయి.

ఆర్థిక రంగంలో 1991 తర్వాత విధిలేని పరిస్థితుల్లో మార్పు వచ్చింది కానీ, ప్రభుత్వంలో, పార్టీల్లో కేంద్రీకరణ, చట్టబద్ధ పాలన కొరవడం, విద్యా, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో అధ్వాన్న పరిస్థితులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇందిర కాలంలో కంటే రాష్ట్రాలు ఇప్పుడు బలపడినప్పటికీ వ్యవస్థల కన్నా వ్యక్తులే ఇప్పటికీ రాజకీయం, పాలన, పార్టీల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

ఆర్థిక వ్యవస్థల స్థాయిలో మనకు దక్షిణ కొరియాకు ఇంత అంతరం ఉన్నప్పుడు మనం ఎమర్జెన్సీ పై వారి స్థాయిలో స్పందించగలమా?

సోషల్ మీడియా యుగం కాబట్టి దేశంలో, ప్రపంచంలో ఏం జరిగినా క్షణాల్లో తెలిసే అవకాశం, యువత అత్యధికంగా ఉండటం వల్ల ఇందిర హయాంలోలా ప్రత్యక్ష ఎమర్జెన్సీ విధిస్తే (ఇండియా లాంటి సువిశాల, సంక్లిష్ట వైవిధ్య భరిత దేశంలో మార్షల్ లా అసాధ్యమని ఇందిరాగాంధీ హయాంలోనే సైనిక అత్యున్నతాధికారి స్పష్టం చేశారట) దక్షిణ కొరియా స్థాయిలో కాకున్నా, ప్రతిఘటన ఉంటుందని సందేహం లేదు. అయితే అది ఒక పరిధి దాటి ఉండే స్థాయిలో మనం ఇంకా బలపడలేదు కాబట్టే, చాలా రాష్ట్రాల్లో కొన్ని సందర్భాల్లో జాతీయస్థాయిలోనూ ఇప్పటికీ అప్రకటిత ఎమర్జెన్సీ ధోరణుల్ని ప్రభుత్వాలు అమలు చేయడం చూస్తున్నాం.

దక్షిణ కొరియా ఉదంతం కావొచ్చు, రాజ్యాంగం అమలు 75వ వార్షికోత్సవం కావొచ్చు..1975 ఎమర్జెన్సీ కాలం నుంచి కొన సాగుతున్న వ్యవస్థీకృత లోపాల్ని సరిచేసుకుని, 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థకు తగ్గట్టుగా దేశ ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం కావించు కోవల్సిన ఆవశ్యకతపై మనల్ని అప్రమత్తం చేస్తున్నాయి. ✰

# సినిమాకి కంటెంట్, కనెక్ట్ ముఖ్యం

సినిమా సమాజానికి ఉపయోగపడే కంటెంట్ తో ప్రజలకు కనెక్ట్ అయ్యేలా ఉండాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డిఆర్) లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కళా శ్రీనివాస్ నిర్మాత, దర్శకుడిగా కళా ఆర్ట్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న దక్కన్ సర్కార్ సినిమా పోస్టర్‌ను హైదరాబాదులోని తన కార్యాలయంలో జేపీ ఆవిష్కరించారు. ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి తీశాం, ఎంత పెద్ద హీరోలు ఉన్నారు, అనేది మాత్రమే సినిమాకు ముఖ్యం కాదని, పాపులర్ కళ రూపమైన సినిమాకు



సామాజిక కోణం ఉండాలని జేపీ అన్నారు. కోట్లు లేకుండా ప్రజలను ఆకట్టుకోవచ్చు అన్నారు. ఈ సినిమా టీజర్ చూస్తే తనకు అలాంటి భావం కలుగుతుందన్నారు. కళా శ్రీనివాస్ ప్రయత్నం యువతకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు మల్లి, కళా శ్రీనివాస్, చిత్ర హీరో చాణిక్య, సామాజికవేత్త రంగనాయకుల సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఐఏఎస్ అకాడమీ విద్యార్థులతో సంభాషణ

భారత్ ఆరోగ్యకరమైన రిపబ్లిక్‌గా వర్ధిల్లేందుకు అవసరమైన అందరికీ స్వేచ్ఛ సమానత్వం న్యాయం అంశాలపై నారాయణ ఐఏఎస్ అకాడమీ హైదరాబాదులో నిర్వహించిన సంవాద్ సంభాషణ కార్య క్రమంలో డాక్టర్ జయప్రకాష్ నారా యణ్ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు.





## డిజిహెచ్ఎస్ 75 వార్షికోత్సవం

ఆగాఖాన్ ఎడ్యుకేషన్ సర్వీస్ (ఏకెఈఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్‌లో కొనసాగుతున్న డైమండ్ జూబ్లీ హైస్కూల్ 75వ వార్షికోత్సవ కార్యక్రమంలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. పాఠశాల విద్యలో తక్షణం రావాల్సిన ఆచరణాత్మక మార్పులను, అందులో పాలకులు ప్రభుత్వ యంత్రాంగం సమాజం నిర్వర్తించాల్సిన పాత్రను వివరించారు. కార్యక్రమంలో పద్మశ్రీ , ద్రోణాచార్య అవార్డు గ్రహీత సయ్యద్ మహమ్మద్, ఏ కే ఈ ఎస్ చైర్మన్ సీఈవో ఫర్హాద్ , డైరెక్టర్లు నూరుద్దీన్ ధమాని, మోనిషా తేజుని, రిషబ్ జివాని, పలువురు పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ అభివృద్ధికి రోడ్ మ్యాప్

**స్వర్ణాంధ్ర-2047 పేరుతో ఏపీ అభివృద్ధికి రోడ్ మ్యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.**

| స్వర్ణాంధ్ర-2047 ప్రధాన లక్ష్యాలు | | |
|---|---|---|
| అంశం | 2024లో | 2047 నాటికి లక్ష్యం |
| జనాభా | 5.30 కోట్లు | 5.80 కోట్లు |
| అక్షరాస్యత | 72శాతం | 100శాతం |
| ఆర్థిక వ్యవస్థ(జీఎస్‌డీపీ) | 170 మిలియన్ డాలర్లు | 2.4 ట్రిలియన్ డాలర్లు |
| సగటు ఆయుప్రమాణం | 70.6 ఏళ్లు | 85 ఏళ్లు |
| మహిళా కార్మిక శక్తి | 45.8శాతం | 80శాతానికి పైగా |
| తలసరి ఆదాయం | 3,200 డాలర్లు | 42,000 డాలర్లు |
| పట్టణ జనాభా | 36శాతం | 60శాతం |
| నిరుద్యోగిత రేటు | 4.1శాతం | 2శాతం కంటే తక్కువ |
| ఎగుమతులు | 19.3 బిలియన్ డాలర్లు | 450 బిలియన్ డాలర్లకు పైగా |

**స్వర్ణాంధ్ర సాధనకు పది సూత్రాలు**

1.**పేదరికం లేని సమాజం :** వచ్చే ఐదేళ్లలో పేదరికం తగ్గించాలి. 2047 నాటికి తలసరి ఆదాయం 42వేల డాలర్లకు పెంచాలి. దీనిలో భాగంగా పేదల ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి పెట్టాం. బిఫోర్ విధానంలో అట్టడుగు వర్గాల వారిని ఆర్థికంగా పైకి తీస్తాం. దీనికోసం త్వరలో ప్రత్యేక పాలసీ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలి.

2.**ఉపాధి ఉద్యోగ కల్పన:** ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటాం. వర్క్ ఫ్రం హెూం అందుబాటులోకి తెస్తాం. జనాభా పెరగాలి దీన్ని ఉధృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

3.**నైపుణ్యం- మానవవనరులు అభివృద్ధి:** ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు ఏపీకి వస్తున్నాయి. వైజాగ్, తిరుపతి, అమరావతిలో నాలెడ్జ్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అభివృద్ధిని వికేంద్రీకరిస్తున్నాం. నైపుణ్యం శిక్షణ అందిస్తాం.

4. **నీటి భద్రత:** నదుల అనుసంధానం పూర్తి చేస్తాం. కనీసం 500 టీఎంసీల నీటిని గోదావరి నుంచి పెన్నా, బనకచర్లకు తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి నీరు అందిస్తాం.

5.**సాగులో అధునాతన సాంకేతికత:** రైతును రాజుగా చేస్తాం. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తాం. యాంత్రీకరణ, ఏఐ, డ్రోన్ సేద్యం తదితర విధానాలను అమలు చేస్తాం.

6. **ప్రపంచస్థాయి అత్యుత్తమ లాజిస్టిక్స్:** దేశ జీడీపీలో 14% రవాణాకి ఖర్చవుతోంది. చైనాలో ఇది 8% మాత్రమే. దీన్ని తగ్గించాలి. రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. జల రవాణాను ఉపయోగించుకుంటాం. తద్వారా రవాణా వ్యయాన్ని తగ్గిస్తాం.

7. **వ్యయ నియంత్రణ, ఇంధన వనరుల వినియోగం:** ఇన్నల రంగంలో వనరుల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటాం. ప్రపంచమంతా గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తోంది. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయాలనేది సంకల్పం. సూర్యఘర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రోత్సహిస్తాం. మిగులు విద్యుత్తును గ్రిడ్డుకు సరఫరా చేసి అదనపు ఆదాయం సాధించే మార్గాలు చూపిస్తాం. విద్యుత్తు కొనుగోలు ధర యూనిట్ 5.19 ఉండగా, ఈ ఏడాది 4.80కు తగ్గించాం. ఇంకా తగ్గించి అస్తవ్యస్తమైన విద్యుత్ శాఖను బాగు చేస్తాం.

8. **నాణ్యమైన ఉత్పత్తులు:** రాష్ట్రంలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, టెక్నాలజీ ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించి.. ప్రపంచ మార్కెటుతో పోటీపడే ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తాం.

9.**స్వచ్ఛాంధ్ర:** అందరూ స్వచ్ఛాంధ్రను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి. పల్లెలు, పట్టణాల్లో స్వచ్ఛతను పాటించాలి. వాతావరణం పరిశుభ్రంగా ఉంటే స్వచ్ఛమైన ఆలోచనలు వస్తాయి.

10. **అన్ని రంగాల్లో విస్తృత సాంకేతికత (డీప్ టెక్):** డేటా అనేది భవిష్యత్తు సంపద. వివిధ రకాల డేటాను అనుసంధానిస్తాం. తద్వారా మనం తీసుకునే నిర్ణయాలు పరిపూర్ణంగా ఉంటాయి. ఎంత కష్టపడుతున్నామో కంటే ఎంత స్మార్ట్‌గా పని చేస్తున్నామనేది ముఖ్యం. టెక్నాలజీని ఉపయోగించుకొని పనిచేయాలి.

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు ఆర్థిక అభివృద్ధి పరంగా బాగున్నప్పటికీ ఆ అభివృద్ధిని అనేక రెట్లు పెంచుతూ సుస్థిరం చేసేలా సమ్మిళితంగా లేవని, విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన వంటి ఇందుకు కీలకమైన రంగాల్లో మౌలిక సమస్యను గుర్తించి ప్రభుత్వం పరిష్కారాలు రూపొందించలేదని విమర్శ వినిపిస్తోంది.

# భారీగా పెరగనున్న పట్టణ జనాభాతో నీరు అతిపెద్ద సవాలు

## లీకేజీల్ని అరికడితే 40% దాకా ఆదా

**ప్రతి నీటి చుక్కను సమర్థంగా వినియోగించడంతోపాటు దాన్ని పక్కాగా లెక్క కట్టాలని వాటర్ ఆడిట్ కౌన్సిల్ చైర్మన్ అవినాష్ మిశ్రా తెలిపారు. 2050 నాటికి దేశ జనాభాలో 160 కోట్లకు చేరుకుంటుందని.. అప్పటికి పట్టణ జనాభా 50% ఉంటుందని పేర్కొన్నారు. భారీగా పెరగనున్న పట్టణ జనాభాను మన ముందున్న అతిపెద్ద సవాలుగా గుర్తించాలన్నారు. నీటి వృథాను పూర్తిగా అరికట్టడంతో పాటు పునర్వినియోగంతోనే దీన్ని అధిగమించొచ్చని పేర్కొన్నారు. ఆర్థిక అంశాల్లో డబ్బు వినియోగానికి సంబంధించి ఆడిట్ చేసినట్లే నీటిని ఆడిట్ చేయడం తమ లక్ష్యమన్నారు. పలు అంశాల్ని ఇటీవల ఒక ప్రముఖ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.**

### నీరు ఆర్థికపరమైన వస్తువే

దేశ ఉత్పాదకతలో నీటి ఆవశ్యకత కీలకం. తాగునీటి అవసరాలు తీరిన తర్వాత నీటిని ఆర్థికపరమైన వస్తువుగా భావించాలి. జాతీయ స్థూలఉత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ రంగం బాట 15-16శాతంగా ఉంది. సేవా రంగం నుంచి 55-60 శాతం వస్తుండగా, పారిశ్రామిక రంగం వాటా 14-15శాతం. వ్యవసాయ రంగం నీటి వాటా 88 నుంచి 90 శాతం ఉండగా, ఇతర రంగాలకు మిగిలింది 10 నుంచి 12 శాతమే. దీంతో పట్టణాలు నగరాలకు సుదూర ప్రాంతాల్లోని ప్రాజెక్టుల నుంచి తాగునీరు తెచ్చు కుంటున్నాం. పంపింగ్, నీటి శుద్ధి వంటివి ఎంతో వ్యయంతో కూడుకున్నవి కావడంతో పాటు అత్యధిక విద్యుత్ వినియోగంతో ముడిపడి ఉంది. ఇదే సమయంలో సరఫరా అయ్యే నీటిలో 30-40శాతం వృధా అవుతుంది. పైగా ఇళ్లకు చేరే నీటిని సమర్థంగా ఉపయోగించుకోవడం లేదు

**దేశీయంగా పట్టణాలు నగరాల్లో ప్రతిరోజు 7000 కోట్ల 7000 కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు పుట్టుకొస్తుంది. అందులో 28 శాతమే శుద్ధికి నోచుకుంటుంది మిగిలిందంతా సమీపంలోని జల వనరుల్లోకి చేరి వాటిని కలుషితం చేస్తుంది. రాబోయే రోజుల్లో వ్యర్థ జలాలు మరింతగా పెరగనున్నాయి వాటి శుద్ధికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకుంటే తీవ్ర నష్టం తప్పదు**



పంపులు కుళాయిలు ఫ్లషింగ్ లలో లీకేజీలతో నష్టం జరుగుతుంది దీనిని అరికట్టాలి. 30-40% రాదా చేసుకోవచ్చు తాగు అవసరాలకు తాజా నీరు ఉపయోగించుకుని, ఇతర అవసరాలకు శుద్ధి చేసినది వాడు కోవచ్చు. గ్రే వాటర్‌ను రీసైకిల్ చేసి వాడుకోవడం తోపాటు, బ్లాక్ వాటర్ ను మురుగు శుద్ధి కేంద్రాలకు పంపి శుభ్రం చేయాలి.

### వాటర్ ఆడిట్ కౌన్సిల్ పాత్ర

యూనియన్ జల శక్తి మంత్రిత్వ శాఖ చొరవతో వాటర్ ఆడిట్ కౌన్సిల్ 2023లో ఏర్పాటు అయింది. నీటి పొదుపు అంశంపై వివిధ సంస్థలతో కలిసి పనిచేస్తుంది. నీటి వినియోగం తగ్గించడానికి ప్రాతిపదికగా ఉండే అంశాలతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా

## ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న నైట్రేట్

దేశవ్యాప్తంగా 440 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో నైట్రైట్ అత్యధికంగా ఉన్నట్లు కేంద్ర భూగర్భ జలాల మండలి వెల్లడించింది కేంద్ర భూగర్భ జలాల మండలి భూగర్భ జలాల నాణ్యత నివేదిక 2024ను విడుదల చేసింది. 20 శాతం నమోనాల్లో అనుమతించదగిన దానికన్నా ఎక్కువ నైట్రేట్ ఉన్నదని గుర్తించినట్లు ఆ నివేదిక తెలిపింది. నైట్రేట్ కాలుష్యం వల్ల పర్యావరణం, ప్రజారోగ్యం దెబ్బతింటాయి.

నైట్రేట్ స్థాయిలు మితిమీరితే శిశువుల్లో బ్లూ బేబీ సిండ్రోమ్ వంటి సమస్యలు వస్తాయి. ఈ నీరు తాగడానికి సురక్షితమైనది కాదు.

భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉన్న జిల్లాలు దేశవ్యాప్తంగా 15. కాగా వీటిలో తెలంగాణలోని రంగా రెడ్డి ఆదిలాబాద్ సిద్దిపేట ఏపీలోని పల్నాడు ఉన్నాయి.

ఎక్కువ నమూనాల్లో నైట్రేట్ ఉన్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు తర్వాత నాలుగో స్థానంలో తెలంగాణ ఉంది.

దేశంలో నైట్రేట్ తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాలో మూడో స్థానంలో రంగారెడ్డి 12, 13 స్థానాల్లో అదిలాబాద్, సిద్దిపేట ఉన్నాయి.

దేశవ్యాప్తంగా 2023లో నైరుతి రుతుపవనాలు రావడానికి ముందు, అవి వచ్చి వర్షాలు కురిసిన తర్వాత రెండు దఫాలుగా భూగర్భ జలాల నుంచి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించారు. ఒక్కో అంశానికి సంబంధించి విడివిడిగా నమూనాలను సేకరించారు. అనేక ప్రాంతాల్లో విషపూరిత రసాయన అవశేషాలు పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. కొన్ని జిల్లాల్లో ఈ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. వార్షిక భూగర్భ జలాల నాణ్యత నివేదిక 2024 పేరుతో కేంద్ర భూగర్భ జలమండలి విడుదల చేసిన తాజా నివేదిక తాగునీటిలో ఉన్న రసాయన అవశేషాలు గురించి వివరించింది.

భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఐదవ స్థానంలో తెలంగాణ ఉంది. 2023 రుతుపవనాల తర్వాత 1150 నీటి నమూనాలను పరీక్షిస్తే 171 నమూనాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న రాష్ట్రాల్లో రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, ఢిల్లీ తర్వాత స్థానంలో తెలంగాణ ఉంది. జిల్లాల వారీగా చూస్తే దేశంలో ఐదో స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఉంది. ఈ జిల్లాలో సేకరించిన 43 నీటి నమూనాలను పరీక్షిస్తే 21 నమూనాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. యాదాద్రి కన్నా ముందు రాజస్థాన్లోని నగౌర్, బోద్పూర్, హర్యానాలోని జిందగీ, సోనిపట్టు జిల్లాలు ఉన్నాయి. నారాయణపేట, జోగులాంబ గద్వాల, ములుగు, జయశంకర్ భూపాలపల్లి ,మహబూబాబాద్ తప్ప మిగిలిన 28 జిల్లాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. రుతుపవనాలకు ముందు సేకరించిన 35 నీటి నమూనాల్లోని 20 శాతం లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉండగా వర్షాలు పడిన తర్వాత 15.49 శాతానికి తగ్గింది.

మాన్యువల్‌ను అభివృద్ధి చేశాం. వృధాను గుర్తించడంతో పాటు ఎక్కడెక్కడ అరికట్టవచ్చో అవగాహన కలిగించడంతోపాటు నీటి రంగాల్లో పనిచేసే వ్యక్తులకు శిక్షణ అందిస్తున్నాం. ఎలాంటి పరికరాలు వాడితే తక్కువ నీరు వినియోగం అవుతుందో తెలియజేస్తున్నాం.

**దేశాభివృద్ధిలో కీలకం**

సేవా, పారిశ్రామిక రంగాలకు తగిన పరిమాణంలో నీరు అందుబాటులో ఉంటేనే అభివృద్ధి సాధ్యం. ఉదాహరణకు జపాన్ దక్షిణ కొరియా అమెరికాలో సెమీ కండక్టర్ ఇండస్ట్రీ వాటా జీడీపీలో 6 నుంచి 8 శాతం. ఇప్పుడు మనము సెమీ కండక్టర్ల తయారీపై దృష్టి సారించాం. దీనికి అల్ట్రా ప్యూర్ వాటర్ కావాలి. ప్రస్తుతం మురుగు శుద్ధి చేసి వినియో గించుకోవడం 20 శాతంగా ఉంది. 2030 నాటికి దీన్ని 50 శాతానికి పెంచాలి. మురుగు నీటి శుద్ధి సామర్థ్యాన్ని పెంచు కోవాలి. వాననీటిని నిలువ చేసుకొని ఉపయోగించుకోవటం అవసరం. ద్రవ్య వ్యర్థాల నిర్వహణ, మురుగు శుద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వ విధానాల తోడ్పాటు అవసరం.

*తెలంగాణలో వ్యవసాయానికి వాడుతున్న భూగర్భ జలాల నమూనాలను పరీక్షిస్తే 10.35% నమూనాల్లో ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నందున సాగుకు వాడకూడదని నివేదిక తెలిపింది.*

*హైదరాబాద్, మేడ్చల్, జోగులాంబ గద్వాల, కామారెడ్డి ,సంగారెడ్డి, రంగారెడ్డి తప్ప మిగిలిన 27 జిల్లాల్లో సేకరించిన నీటి నమూనాల్లో వ్యవసాయానికి వాడు తున్న సాగునీరు సాగుకు సురక్షితం కాదని తేలింది.*

*భూగర్భ జలాల్లో లీటర్ నీటిలో 1.25 మిల్లీగ్రాములకు మించి సోడియం కార్బోనేట్ ఉంటే పంటల సాగుకు వాడకూడదు.*

# సహకార రంగంలో 5.5 కోట్ల ప్రత్యక్ష ఉద్యోగాలు

భారత సహకార రంగం 2030 కల్లా 5.5 కోట్ల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించగలరని ప్రైమస్ పార్టనర్స్ నివేదిక వెల్లడించింది. మరో 5.6 కోట్ల మందికి స్వయం ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొంది. 'ఇండియన్ కో-ఆపరేటివ్ మూమెంట్' పేరుతో మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ 'ప్రైమస్ పార్ట్‌నర్స్' సహకార రంగంపై రూపొందించిన నివేదికను ఇటీవల విడుదల చేసింది.

➡ భారత సహకారం నెట్‌వర్క్ ప్రపంచంలోనే అతి పెద్దది. అంతర్జాతీయంగా మొత్తం 30 లక్షల సహకార సంఘాలు ఉండగా, అందులో సుమారు 30% భారతంలోనే ఉన్నాయి.

➡ సహకార సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థలు ఒక విభాగం మాత్రమే కాదు. అవి పురోగతి, శ్రేయస్సుకు ఉత్ప్రేరకాలయ్యే శక్తిమంత ఇంజన్ లాంటివి. 2016-17 నాటికి ఆర్థిక వ్యవస్థలో మొత్తం ఉపాధిలో 13.3 శాతానికి సహకార సంఘాల వాటా చేరింది. 2007-08లో 12 లక్షల ఉద్యో గాలు ఈ రంగంలో ఉండగా, 2016-17 నాటికి 18.9% వార్షిక వృద్ధితో ఉద్యోగాల సంఖ్య 58 లక్షలకు పెరిగింది. 20 30 నాటికి 5.5 కోట్ల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 5.6 కోట్ల మందికి స్వయం ఉపాధి అవకా శాలను సృష్టించగల సామర్థ్యాన్ని సహకార సంఘాలు కలిగి ఉన్నాయి.

➡ సహకార సంఘాలు స్వయం ఉపాధికి మూల స్తంభాలుగా ఉన్నాయి. ఈ రంగంలో 2006-7లో 1.54 కోట్ల మందికి స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తుండగా ,2018 నాటికి ఈ సంఖ్య మూడు కోట్లకు పెరిగింది. 5-6% వృద్ధిరేటును కొనసాగించడం ద్వారా ఈ రంగం 20 30 నాటికి అదనంగా 2.5 కోట్ల మందికి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.

➡స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 2030 నాటికి సహకార రంగం వాటా 3-5% ఉండొచ్చు. ♦

## సహకార సంఘాలకు అంతర్జాతీయ తోడ్పాటు

**నూతన ఆర్థిక భాగస్వామ్యానికి ప్రధాని మోదీ పిలుపు**

ప్రపంచవ్యాప్తంగా సహకార సంఘాలకు మద్దతుగా నిలిచే సరికొత్త భాగస్వామ్య ఆర్థిక నమూనాలు సృష్టించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక పురోగతికి ఇది చోదకంగా మారుతుందన్నారు. ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సహకార కూటమి గ్లోబల్ సదస్సులో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 ను ప్రారంభిస్తూ, ప్రపంచ దేశాల మధ్య సంబంధాలకు సహకార సంఘాలు కొత్త శక్తిని అందిస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సహకార రంగా వ్యాపారాలను తోడ్పాటు అందించే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సహకార రంగం భారత్‌కు ఒక జీవన విధానమని, సాంస్కృతిక పునాది అని వివరించారు.

## నిపుణుల కొరత

వేగంగా విస్తరిస్తున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు అత్యుత్తమ మానవ వనరులు అవసరం, అయితే మానవవనరుల కొరత తీవ్రంగా వేధిస్తోందని దాదాపు 50% జీసీసీలు అభిప్రాయం వ్యక్తం చేశాయి . దేశంలో ఏటా 15 లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు బయటకు వస్తున్నా నిపుణుల కొరత ఎక్కువగానే ఉంది. ఈ పరిణామం పరిశ్రమ అవసరాలకు, విద్య వ్యవస్థకు మధ్య ఉన్న అంతరాన్ని సూచిస్తుందని ఇండక్టస్ అనే సంస్థ వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈ పరిస్థితిని అధిగమిం చేందుకు పాఠ్యప్రణాళిక తయారీలో ,విద్య విభాగాలతో భాగస్వామ్యం కావాలని, విద్యార్థులకు అన్ జాబ్ ట్రైనింగ్, సర్టిఫికేషన్ కోర్సులను ఐటి సంస్థలు నిర్వహించాలని నివేదిక సూచించింది. విద్యా సంస్థలు తప్పనిసరిగా ఇంట ర్న్‌షిప్ కార్యక్రమాలు చేపట్టాలన్న నిబంధన ఉండాలని పేర్కొంది. దేశంలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు 3.64 లక్షల కొత్త ఉద్యోగులను సృష్టించి నున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ఏటా 15% వృద్ధి రేటుతో పురోగిమిస్తున్నాయి. 2030 నాటికి భారత్‌లోని జీసీసీలు మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్లకు చేరుకుం టుందని అంచనా వేసింది. ప్రభుత్వాలు జీసీసీల అభి వృద్ధికి వీలుగా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి. భవిష్యత్తులో టెక్నాలజీఐ క్వాంటం, కంప్యూటర్ నూతన ఆవిష్కరణకు వీలుగా విధానాలు రూపొందించాలని ఆ నివేదిక సూచించింది.



# Happy NEW YEAR 2025

FDR
FOUNDATION for DEMOCRATIC REFORMS

**భారత్ సెంచరీగా భావిస్తున్న 21 వ శతాబ్దంలో నాలుగో వంతు గడిచిపోయింది. అభివృద్ధి చెందిన దేశం స్థాయిని అందుకోవటానికి మన చేతిలో ఉన్న సమయం, ఇంకో నాలుగో వంతు, అంటే పాతికేళ్లు మాత్రమే.**

సరైన బహిరంగ చర్చతో, పార్టీల మధ్య ఏకాభిప్రాయంతో, పర్యావరణహిత సాంకేతికతతో, కాలంతో పోటీపడి 2025 లో ఈ మౌలిక మార్పుల్ని సాధించుకుందాం, లక్ష్యాన్ని అందుకుందాం..

- ఆర్థిక క్రమశిక్షణ - సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం
- నాణ్యమైన పాఠశాల విద్య, ఆరోగ్యం
- గ్రామాల మధ్య చిన్న పట్టణాలు - యువతకు వలసలు అవసరంలేని ఉపాధి - వ్యవసాయం లాభసాటి
- చట్టబద్ధపాలన - స్థానిక కోర్టులు (గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా)
- జమిలికి బదులు CM ల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి వంటి నిజంగా అవసరమైన ఎన్నికల సంస్కరణలు
- అధికార వికేంద్రీకరణ - స్థానిక ప్రభుత్వాల బలోపేతం - ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా నాణ్యమైన పౌర సేవలు

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్,**
ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్ సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th JANUARY, 2025 Posting Date 15 &16th of every month







దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, పరిష్కార వ్యూహాలపై చర్చించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్) బృందం ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగరియా, సభ్యులతో న్యూఢిల్లీలో సమావేశమైంది. ఆర్థికాభివృద్ధి సమ్మిళితమై సమాజంలోని అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూర్చేందుకు విద్య, ఆరోగ్యం, చిన్న పట్టణాల అభివృద్ధి మొదలైన రంగాల్లో అవసరమైన సంస్కరణలను కూడా జేపీ బృందం వివరించింది.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**